RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ | 15 ఫిబ్రవరి 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:216

# తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై రాహుల్ గాంధీ స్పందన

**తెలంగాణ పురపాలక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఘన విజయం**

**తమ సంక్షేమ పాలనకు లభించిన తీర్పు ఇదని రాహుల్ గాంధీ వ్యాఖ్య**

**116 మున్సిపాలిటీల్లో 64 కైవసం చేసుకున్న కాంగ్రెస్**

**గత ఎన్నికలతో పోలిస్తే భారీగా నష్టపోయిన బీఆర్ఎస్**

**కొన్ని కార్పొరేషన్లలో బీజేపీ అతిపెద్ద పార్టీగా ఆవిర్భావం**



తెలంగాణలో జరిగిన పురపాలక, నగరపాలక సంస్థల ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. ఈ ఫలితాలు తమ సంక్షేమ పాలనకు, ప్రజల తెలంగాణ నమూనాకు ప్రజలు ఇచ్చిన ఆమోదమని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలిపారు. శనివారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. ఈ విజయం కాంగ్రెస్ కార్యకర్తలు, తెలంగాణ ప్రజలదని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికీ అభివృద్ధి ఫలాలు అందించాలనే తమ 'ప్రజల తెలంగాణ' లక్ష్యం స్థిరంగా ఉంటుందని హామీ ఇచ్చారు.రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలకు గాను కాంగ్రెస్ పార్టీ 64 చోట్ల జయకేతనం ఎగురవేసింది. అలాగే 7 కార్పొరేషన్లలో మూడింటిని కైవసం చేసుకుంది. మంచాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లు హస్తం ఖాతాలో చేరాయి. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కేవలం 13 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లతో సరిపెట్టుకుంది. మరో 38 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకీ స్పష్టమైన ఆధిక్యం లభించలేదు. దీంతో ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికల కోసం స్వతంత్రులు, చిన్న పార్టీల మద్దతు కూడగట్టేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అప్పటి టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) 100కు పైగా స్థానిక సంస్థలను గెలుచుకోగా, ఈసారి ఆ పార్టీ పనితీరు గణనీయంగా తగ్గింది. ఇక బీజేపీ సొంతంగా ఒక్క మున్సిపాలిటీని గెలవనప్పటికీ, తమ ఎంపీ స్థానాలైన కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లలో అతిపెద్ద పార్టీగా అవతరించింది.మొత్తం 2,582 మున్సిపల్ వార్డులకు గాను కాంగ్రెస్ 1,347, బీఆర్ఎస్ 717, బీజేపీ 261 వార్డులను గెలుచుకున్నాయి. బుధవారం జరిగిన ఈ ఎన్నికల్లో 73 శాతానికి పైగా పోలింగ్ నమోదు కాగా, శుక్రవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తిచేశారు.

## రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మహా శివరాత్రి పండుగ శుభాకాంక్షలు



రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మహా శివరాత్రి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆ మహా దేవుడిని ప్రార్థించారు. మహా శివరాత్రి ఉపవాస పూజలను భక్తి ప్రపత్తులతో నిర్వహిస్తున్న భక్తులందరికీ శివయ్య ఆశీర్వాదం ఎల్లవేళలా ఉండాలని సీఎం ఆకాంక్షించారు.

## తెలుగు ప్రజలందరికి మహా శివరాత్రి శుభాకాంక్షలు: టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



పవిత్రమైన మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగు ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ మహేష్ కుమార్ గౌడ్ గారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పరమేశ్వరుడి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో శాంతి, సౌఖ్యం, ఐశ్వర్యం నిండాలని ఆకాంక్షించారు.

ఉపవాస దీక్షలు, జాగరణలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తూ భక్తులు పరమశివుని ఆరాధించే ఈ రోజు మనలోని చెడు ఆలోచనలను తొలగించి, సత్సంకల్పాలతో ముందుకు సాగేందుకు ప్రేరణనిస్తుందని అన్నారు.

భోళా శంకరుడు సమానత్వానికి, సహనానికి ప్రతిరూపమని, సమాజంలో ఐక్యతను బలోపేతం చేసే విలువలను మనం ఆచరణలో పెట్టాలని సూచించారు.

ప్రస్తుత కాలంలో మనుషుల మధ్య ప్రేమ, పరస్పర గౌరవం మరింత అవసరమని, శివరాత్రి సందేశం అదే అని మహేష్ కుమార్ గౌడ్ గారు పేర్కొన్నారు. యువత సనాతన సంప్రదాయాలను గౌరవిస్తూ సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.

ఈ మహా శివరాత్రి సందర్భంగా ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని, భక్తుల కోరికలు నెరవేరాలని కోరుతూ మరోసారి తెలుగు ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## రేవంత్ రెడ్డి ని కలిసిన ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ కౌన్సిలర్ లు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీకి చెందిన 8 మంది ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ ( AIFB) కౌన్సిలర్ లు.

వడ్డేపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో సీఎంను కలిసిన కౌన్సిలర్లు

హాజరైన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, తదితరులు.

సీఎంను కలిసిన వడ్డేపల్లి మున్సిపాలిటీ ఇా×ఖీదీ కౌన్సిలర్లు...

కుర్వ పావని, 1 వ వార్డు

శారద, 2 వ వార్డు

మంజుల, 4 వ వార్డు

యుగేందర్ రెడ్డీ, 5 వ వార్డు

దేవమ్మ, 6 వ వార్డు

విజయ్ భాస్కర్, 7 వ వార్డు

జయశ్రీ, 8 వ వార్డు

ఎరుకల తిమ్మప్ప, 10 వ వార్డు



ప్రజాబలం

15 ఫిబ్రవరి 2026 ఆదివారం

# బండి సంజయ్ కేంద్ర మంత్రో లేక కరీంనగర్ కార్పొరేషన్ మంత్రో అర్థం కావడం లేదు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



హైద్రాబాద్ ఫిబ్రవరి 14 కేంద్ర మంత్రి బండి సంజయ్ కరీంనగర్ లో విన్యాసాలు చేస్తున్నాడు.. ఆయన కేంద్ర మంత్రో లేక కరీంనగర్ కార్పొరేషన్ మంత్రో అర్థం కావడం లేదని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు.

కరీంనగర్ కు తాను చేసిన అభివృద్ధి ఏమిటో ఒక్క మాట చెప్పకుండా మతాన్ని రెచ్చి గొట్టి ఓట్లు సంపాదించాడు..బండి సంజయ్ అన్ని ప్రగల్భాలు పలికినా , ఇంత రెచ్చగొట్టినా ఒక్కటి ప్రజలు బీజేపీ కి మ్యాజిక్ ఫిగర్ ఇవ్వలేదు..

బీజేపీకి స్పష్టమైన తీర్పు రాలేదు.. సింగిల్ లార్జెస్ట్ పార్టీ గా మాత్రమే ఉంది..

రాజకీయాల్లో ఎన్నికల సమయంలో పొత్తులు, ఫలితాల తర్వాత పొత్తులు సహజం..

స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పొత్తులు ఉంటాయి.. కరీంనగర్ లో కాంగ్రెస్, ఎంఐఎం కలిసి కుట్ర చేస్తున్నాయని బండి సంజయ్ తెగ గింజుకుంటున్నాడు..

ఎంఐఎం తో మేం ఎలాంటి పొత్తు పెట్టుకోలేదు.. పెట్టుకోబోం కూడా

మాకు కేవలం మజ్లిస్ తో అవగాహన మాత్రమే ఉంటుంది..

ఎంఐఎం పోటీ చేసిన స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఉన్నారు.. పోరాడి ఓడిపోయారు..

కాంగ్రెస్, ఎంఐఎం కి ,ఇండిపెండెంట్లకి ఓట్లు వేసిన వాళ్లు కూడా కరీంనగర్ ప్రజలే.. ఇన్ని కబుర్లు చెపుతున్న నువ్వు ఇండిపెండెంట్లను ఎందుకు నీ పార్టీలో చేర్చుకున్నావు..?

రాత్రి ఇంటికి పిలిచి ఎందుకు కండువాలు కప్పావు..? ప్రజలు ఇచ్చిన తీర్పు అనుగుణంగానే పార్టీల కార్యాచరణ ఉంటుంది.. బీజేపీకి మేయర్ పదవి రాకపోతే ఒక్కొక్కరిని రోడ్లపైని ఉరికిస్తామని బండి సంజయ్ అంటున్నాడు..

బండి సంజయ్..నువ్వు కేంద్ర మంత్రివేనా..? అందులోనూ హోం శాఖ సహాయ మంత్రి వి నువ్వు.. స్వయంగా మంత్రి గా ఉంటు శాంతిభద్రతలకు భంగం కల్గించేలా మాట్లాడుతున్నావు.

బండి సంజయ్ ఎన్ని పెదబొబ్బలు పెట్టినా పట్టించుకునే వాడెవ్వడు లేదు..

నీ ఉడత వూపులకు భయపడేవాళ్లు ఎవరూ లేరు మీరెంత నీచరాజకీయాలు చేసినా తెలంగాణ బీజేపీకి స్థానం లేదు.. ఇది మరోసారి నిరూపితమైంది..

42 మున్సిపాలిటీల్లో మీకు వచ్చింది గుండు సున్న.. సొంతంగా ఒక్క మున్సిపాలిటీ కూడా గెలవలేదు...8 మంది ఎంపిలు, 8 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నా మీకు ఒక్క మున్సిపాలిటీ కూడా దక్కలేదు..

బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్, నిజామాబాద్ లో ఎందుకు ప్రచారం చేయలేదు..?

సిరిసిల్ల లో ప్రచారం చేసిన కేటీఆర్ కరీంనగర్ లో ఎందుకు ప్రచారం చేయలేదు..?

బీఆర్ఎస్, బీజేపీ క్లోన్ లా కలిసిపోయారు..

ఉత్తర తెలంగాణలో బలంగా ఉన్నామని చెప్పుకున్న బీజేపీ ఎందుకు ఓడిపోయింది..

బీఆర్ఎస్ సహకారం తీసుకున్నా బీజేపీకి సీట్లు రాలేదు..బండి సంజయ్ సైకో జోకర్ గా మారాడు.. కాంగ్రెస్ కు, బీఆర్ఎస్ కు అంటకట్టడం దారుణం.. మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ కు బాగా సీట్లు వచ్చాయని కేటీఆర్చెప్పుకుంటున్నాడు..కిందపడి కూడా పైచేయి నాదే అని కేటీఆర్ కథలు పడుతున్నాడు..

మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు గుండు సున్నా..

118 మున్సిపాలిటీల్లో 14 వస్తే బీఆర్ఎస్ గెలిచినట్లుఅవుతుందా..? ఎక్స్ అఫిషియో సభ్యుల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలా వ్యవహారించిందో అందరికి తెలుసు..

జైలుకు పోవాలని కేటీఆర్ఉబలాటపడుతున్నాడు..

ప్రజలు కాంగ్రెస్ పార్టీని మరో సారి ఆశీర్వధించారు.. మాకు 40 శాతానికి పైగా ఓట్లు వచ్చాయి..

పాడి ఆవులా కాంగ్రెస్ కనిపించడం వల్లనే ప్రజలు మాకు ఓట్లు వేస్తున్నారు..

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అరగుండు మీద ప్రజలు కొబ్బరికాయ కొట్టారు..

అర్వింద్ మాట్లాడే భాష మాకు కూడా వచ్చు..

బీఆర్ఎస్ గుమస్తా పత్రిక నమస్తే తెలంగాణలో రాతలను చూస్తే జాలేస్తుంది.. మరీ బానిసలా మారింది..మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధించింది.. ఈ విషయం తెలంగాణ ప్రజలందరికి తెలుసు

దాదాపు 90 మున్సిపాలిటీలు మా ఖాతాలో పడబోతున్నాయి..

ప్రజా తీర్పు ను వక్రీకరించి గుమస్తా తెలంగాణలో రాసుకుని ఆనందిస్తున్నారు..

పుర ఫలితాల్లో కాంగ్రెస్ కు ఎదురుదెబ్బ.. 66 మున్సిపాలిటీలు మాత్రమే వచ్చాయని రాసుకొచ్చారు..

కాంగ్రెస్ కర్రు కాల్చి వాత పెట్టారట..

ఆరాచకాలకు ఎదురొడ్డి బీఆర్ఎస్ పోరాటం చేసిందట..

కొంచమైన సిగ్గుండాలి ఇలాంటి రాతలు రాయడానికి..

ప్రజాతీర్పును కూడా వక్రీకరించి రాస్తారా..?

మీ పేపర్ లో మీకు మీరు తొడలు కొట్టుకుని, జబ్బులు చర్చుకుని ఆనందిస్తున్నారు..

పత్రికఅనిచెప్పుకున్నప్పుడు కనీస విలువలైనా పాటించాలి కదా..?అని అన్నారు.

# అమెరికా ఒత్తిడికి భారత్ తలొగ్గిందా

భారత్?అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో భారత్‌పై అమెరికా టారిఫ్‌లు 18 శాతానికి తగ్గాయి. ఇక అదే సమయంలో అమెరికా భారత్‌పై మరో ఒత్తిడి పెంచింది. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు తగ్గించాలని ఆదేశించింది. భారత్‌తో సంబంధం లేకుండానే డొనాల్డ్ ట్రంప్.. భారత్ రష్యా నుంచి ఆయిల్ కొనుగోళ్లు తగ్గిస్తోందని ప్రకటించారు. అయితే దీనిపై భారత్ ఎలాంటి ప్రకటన చేయలేదు. మంత్రి పీయూష్ గోయల్ మాత్రం రష్యా ఆయిల్ కొనుగోలు ట్రేడ్‌లో భాగం కాదని ప్రకటించారు.భారత్?అమెరికా మధ్య ఇటీవల మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరింది. దానికి ముందు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన 50% టారిఫ్‌లను 18%కి తగ్గించారు. వాణిజ్య ఒప్పందం తర్వాత ట్రంప్ కీలక ప్రకటన చేశారు. భారత్ రష్యా ఆయిల్ కొనుగోలు తగ్గించి అమెరికా, వెనెజువెలా నుంచి కొంటుందని ప్రకటించారు. దీనిపై భారత్ అధికారికంగా స్పందించకపోయినా, గణాంకాలు మార్పును నిర్ధారిస్తున్నాయి. పుతిన్ దీన్ని భారత నిర్ణయంగా గుర్తించారు.2025 డిసెంబర్‌లో రష్యా నుంచి 2.7 బిలియన్ డాలర్ల విలువైన ఆయిల్ దిగుమతి చేసుకుంది. నవంబర్‌లోని 3.8 బిలియన్ డాలర్ల విలువైన ఆయిల్ కొనుగోలు చేసింది. అంటే నెల రోజుల్లో ఆయిల్ దిగుమతి 27% తగ్గించింది. మొత్తం భారత ఆయిల్ దిగుమతిలో రష్యా వాటా 34% నుంచి 24.9%కి పడిపోయింది. 2024 డిసెంబర్‌తో పోల్చితే 15% కొనుగోలు తగ్గింది. 38 నెలలుగా రష్యా నుంచి జరుగుతున్న కొనుగోలులు ఇదే తక్కువ.అమెరికా నుంచి 2025 డిసెంబర్ దిగుమతులు 2024తో పోలిస్తే 31% పెరిగాయి. రష్యా నుంచి 15 శాతం తగ్గితే.. అమెరికా నుంచి దిగుమతి రెట్టింపైంది. వెనెజువెలా కూడా ప్రధానంగా చేరుతోంది. ఇది ట్రంప్ వాగ్దానాలకు సమానంగా ఉంది, కానీ ఆర్థిక లాభాలు ప్రశ్నార్థకం.రష్యా ఆయిల్ రవాణా ఖర్చు అమెరికా ఆయిల్ షిప్పింగ్ చార్జీలతో పోలిస్తే సగం ఉంటుంది. రష్యా నుంచి మనం రూపాయిల్లో కొనుగోలు (పెట్రో?రూపీ ఇన్వెస్ట్‌మెంట్) చేశాం. ఆ రూపాయలను కూడా రష్యా భారత్‌లోనే ఇన్వెస్ట్ చేసింది. అమెరికా నుంచి డాలర్లలోనే లావాదేవీలు జరుపుతున్నాం. ఇక అమెరికా నుంచి రవాణాకు భారత్ బ్యారెల్‌కు 4 నుంచి 5 డాలర్లు అదనంగా చెల్లించాలి. వెనెజువెలా ఆయిల్ కొటే బ్యారెల్‌కు 10 డాలర్లు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. రష్యా ఆయిల్ తక్కువగా వస్తున్నా.. అమెరికా ఒత్తిడి కారణంగానే మోదీ రష్యా ఆయిల్ తగ్గించి అమెరికా ఆయిల్ పెంచినట్లు చర్చ జరుగుతోంది.ఆయిల్ తగ్గుదల అమెరికా ఒత్తిడికి సూచన. తదుపరి రష్యా ఆయుధాలపై ఆంక్షలు, అమెరికా సామగ్రిని కొనుగోలు డిమాండ్ రావచ్చు. ఇది భారత విదేశాంగ వ్యూహాన్ని పరీక్షిస్తుంది.ఇదిలా ఉంటే భారత్‌కు రష్యా ఆయిల్ దిగుమతి తగ్గింది. 2024 డిసెంబర్‌తో పోల్చితే 2025లో 15% తగ్గుదల నమోదైంది. నవంబర్?డిసెంబర్ మధ్య 27% తగ్గుదల.నమోదైంది. ఇక ఇదే సమయంలో అమెరికా దిగుమతులు 31% పెరిగాయి. దీంతో భారత్ అమెరికా ఒత్తిడికి తలొగ్గుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.రష్యా, ఇరాన్ నుంచి బ్యారెల్ ఆయిల్ రవాణాకు షిప్పింగ్ చార్జి ఒక డాలర్ ఖర్చు అయ్యేది. అమెరికా, వెనెజువెలా నుంచి రవాణ చేయడానికి 3 నుంచి 5 డాలర్లవరకు కర్చు చేయాల్సి వస్తుంది. దీంతో భారత్‌పై రవాణా భారం మూడు రెట్లు పెరుగుతుంది. ఇక రష్యా, ఇరాన్ నుంచి భారత్ రూపాయల్లోనే ఆయిల్ కొనుగోలు చేస్తోంది. అమెరికా నుంచి కొనాలంటే డాలర్లలో కొనాలి. రష్యా రూపాయలను భారత్‌లోనే పెట్టుబడి పెట్టేలా రిజర్వు బ్యాంకు అవకాశం కల్పించింది. దీంతో మన దేశంలో పెట్టుబడులు పెరిగాయి.డాలర్‌లో కొనుగోళ్లు రూపాయి విలువపై ఒత్తిడి పెంచుతాయి. రష్యా వ్యవస్థ ఉపాధి అవకాశాలు, ఆర్థిక ప్రవాహాన్ని పెంచుతుంది. అమెరికా మార్పు దీర్ఘకాలిక ఖర్చులు పెంచి, ఆర్థిక సమతుల్యాన్ని భంగపరుస్తుంది.ఆయిల్ మార్పు భవిష్యత్ ఆయుధ కొనుగోళ్లలో అమెరికా ఒత్తిడికి దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇరాన్ ఆంక్షల్లా రష్యా మార్పు భారత వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని పరిమితం చేస్తుంది. చైనా, యూరప్ కొనుగోళ్లు కొనసాగుతుంటే భారత్ పై మాత్రమే అమెరికా ఒత్తిడి చేయడం గమనార్హం.స్వాతంత్ర్య నిర్ణయాలు ఆర్థిక ఒత్తిడికి గురవకూడదు.రష్యా ఆధారం తగ్గడం ధరల పెరుగుదలకు దారితీస్తుంది. ఆత్మనిర్భర్ ఎనర్జీ, వైవిధ్యమైన మూలాలు అవసరం. అమెరికాకు పూర్తి తలొగ్గడం దీర్ఘకాలిక ప్రమాదం. సమతుల్య వాణిజ్యం, ఆర్థిక స్వాతంత్ర్యం కీలకం.



**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:**గాంధీభవన్‌కు విచ్చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్క ,రెవెన్యూ మరియు సమచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటీ శ్రీనివాసరెడ్డి లకు పుష్పగుచ్ఛాం ఇచ్చి స్వాగతం పలికిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కె.ఎస్.ఆనంద్‌రావ్



# ఈ నెల 17 లేదా 18వ తేదీ నుంచి రైతుల ఖాతాల్లో భరోసా సొమ్ములు

హైదరాబాద్ తెలంగాణలో ఫిబ్రవరి 17 లేదా 18 నుంచి రైతు భరోసా సాయం జమకు సిద్ధం. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలపై రైతుల ఖాతాల్లో నిధులు. కొత్త దరఖాస్తులపై ఇంకా స్పష్టత లేదు..హైదరాబాద్ రైతాంగం ఆశగా ఎదురు చూస్తున్న రైతు భరోసా సాయం సొమ్ములు ఫిబ్రవరి 17వ తేదీ లేదా 18వ నుంచి బ్యాంకు ఖాతాల్లో వేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. రాష్ట్ర ఆర్థిక శాఖ రైతు భరోసా పథకానికి అవసరమైన నిధులను ఇప్పటికే సమకూర్చుకున్నది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి ఆదేశాలు రాగానే బ్యాంకు ఖాతాల్లో సాయం సొమ్ములు జమ చేయున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం, ప్రజల నుంచి సానుకూలత ఉండడంతో మార్చి నెలలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో ఉంది..ఈ నెలాఖరు కు పరిషత్ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.గత వానాకాలంలో 2025-26 ఖరీఫ్ సీజన్, 69,39,548 మంది లబ్ధిదారుల ఖాతాలలో రైతు భరోసా సాయం వేశారు. ఒక ఎకరా కు రూ.6 వేల చొప్పున మొత్తం రూ.8,744.13 కోట్లు బదిలీ చేశారు. తొలి రోజు ఒక ఎకరా నుంచి ప్రారంభించి మొత్తం తొమ్మిది రోజుల పాటు ఈ మొత్తాన్ని వారి వారి ఖాతాల్లో జమ చేశారు. వీరందరికీ ఈసారి కూడా బదిలీ చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు చేశారు. బోగస్ లబ్ధిదారులను ఏరివేసేందుకు హైదరాబాద్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శాటిలైట్ సర్వే నిర్వహించారు. ఎక్కడ సాగు భూమి ఉంది, బోగస్ లబ్ధిదారులు ఎవరు అనే వివరాలతో ఇటీవలే వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రభుత్వానికి నివేదిక పంపించింది. ఈ సర్వేతో ఏమాత్రం సంబంధం లేకుండా వానాకాలంలో రైతు భరోసా అమలు చేసిన వారందిరికీ, ఈసారి కూడా అమలు చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. వానాకాలంలో 1.46 కోట్ల ఎకరాల భూములకు రైతు భరోసా చెల్లించారు. యాసంగిలో కూడా 1.46 కోట్ల ఎకరాలకు వర్తింప చేయనున్నారు. అయితే ఇందుకు అవసరం అయ్యే నిధులు సమకూర్చుకునేందుకు ఈ నెల 10వ తేదీన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్బీఐ నుంచి రాష్ట్ర ప్రభుత్వం రూ.9వేల కోట్ల రుణం తీసుకున్నది. మున్సిపల్ ఎన్నికల కోడ్ ఈ నెల 16వ తేదీతో ముగియనున్నందున 17 లేదా 18వ తేదీ నుంచి రైతుల ఫోన్ నెంబర్లకు టింగ్ టింగ్ మంటూ మెస్సేజీలు రానున్నాయి. జనవరి నెల సంక్రాంతి పండుగ ముందే ఈ మొత్తాన్ని జమ చేయాల్సి ఉండగా నిధుల లభ్యత లేకపోవడంతో ఈ నెలకు వాయిదా పడింది..వానాకాలం తరువాత పలు జిల్లాల్లో వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు జరిగాయి. కొత్తగా భూములు కొనుగోలు చేసిన వారికి నమోదు కోసం ఎదురు చూపులు చూస్తున్నారు.

పలువురు రైతులు మండల వ్యవసాయ అధికారి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం అనుమతిస్తే తప్ప కొత్తవారి దరఖాస్తులు స్వీకరించే పరిస్థితి లేదని అధికారులు చెప్పి పంపిస్తున్నారు.

ఎప్పటి నుంచి కొత్త దరఖాస్తులు స్వీకరిస్తారనేది రైతులు చర్చించుకుంటున్నారు. వానాకాలం నుంచి ఇప్పటి వరకు ఏ తేదీని కటాఫ్ గా తీసుకుని నమోదు చేస్తారనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

# మహాశివరాత్రికి ముస్తాబైన ఏడుపాయలు

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే వనదుర్గా భవాని మాత జాతరకు మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. మహా శివరాత్రి మహోత్సవంలో మొదటి రోజు 15 న ప్రధాన ఘట్టమైన జాతర, రెండో రోజు 16 న బండ్లు తిరుగుట, మూడో రోజు 17 న రథోత్సవం మూడు రోజుల పాటు ఇక్కడ జాతర అంగరంగ వైభవంగా జరుగనుందనీ , తెలుగు రాష్ట్రాలతోపాటు, పొరుగున ఉన్న కర్నాటక, మహారాష్ట్ర నుంచి దాదాపు 10 లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేయడంతో ప్రభుత్వ యంత్రాంగం. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారని ఆలయ ఈవో వీరేశం తెలిపారు. జాతర రోజుల్లో రద్దీ విపరీతంగా ఉంటుందని దీనిని దృష్టిలో ఉంచుకుని వీఐపీ దర్శనం, ప్రత్యేక దర్శనం, సర్వ దర్శనాలకు వేర్వేరు క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. రాజగోపురం నుంచి ఆలయం వరకు వెళ్లే దారిలో ఎండ తగలకుండా ఉండేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు .జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు, ట్రాఫిక్ నియంత్రణకు మెదక్ ఎస్పీ డివి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 900 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డిఎస్పి ప్రసన్నకుమార్ తెలిపారు.

## రెండు పార్టీలతో ఎంఐఎం అక్రమ సంబంధం కొనసాగిస్తోంది

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వ సుభాష్, లీగల్ సెల్ నాయకులు ఆంటోనీ రెడ్డి, అధికార ప్రతినిధి జె.సంగప్ప, రాష్ట్ర నాయకులు కళ్యాణ్ నాయక్, రవి కిరణ్, కేంద్ర మంత్రి బండ సంజయ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ

కాంగ్రెస్, బీఆర్ఎ పార్టీల వలంటైన్స్ డే శుభాకాంక్షలుఈ రెండు పార్టీలత ఎంఐఎం అక్రమ సంబంధం కొనసాగిస్తోందన్నారు

కాంగ్రెస్ తో సంసారం చేస్తూ... బీఆర్ఎస్ కు కన్ను కొడుతున్న పార్టీ ఎంఐఎంకాంగ్రెస్, బీఆర్ఎస్ అక్రమ సంబంధానికి అనుసంధాన కర్త ఎంఐఎం అన్నారు

మోదీ ఆశీస్సులు, పాలన, కార్యకర్తల కష్టంతో కరీంనగర్ లో బీజేపీ మెజారిటీ స్థానాలు గెలుచుకుంది

అద్భుతమైన తీర్పు ఇచ్చిన కరీంనగర్ ప్రజలకు ధన్యవాదాలులి

ఒక లక్ష్యాన్ని ఎంచుకుని కరీంనగర్ లో బీజేపీ గెలిచిందిలి

ఇండిపెండెంట్లు కూడా బీజేపీలో చేరడంతో మ్యాజిక్ ఫిగర్ దాటింది

కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ కలిస్తే కూడా 26 సీట్లకే పరిమితమయ్యాయి

అయినా బీజేపీకి మేయర్ పదవి రానీయ్యకూడదని ఆ మూడు పార్టీలు ఒక్కటయ్యాయిలి

కరీంనగర్ వేదికగా ఈ మూడు పార్టీల బండారం బయటపడబోతోందిలి

ఈ మూడు పార్టీల దిగజారుడు రాజకీయాలను జనం అసహ్యించుకుంటున్నాయికాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు బహిరంగంగా ఒక్కటై మాట్లాడుకుంటున్నారుసీఎం ఫోన్ చేసి కోరారు...

బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ ప్రతిపాదించే అభ్యర్థికి మద్దతిద్దామని స్థానిక ఎమ్మెల్యే తన పార్టీ కార్పొరేటర్లకు చెబుతున్నారు

తమకే మేయర్ పదవి కావాలని ఎంఐఎం కోరుతోంది

నేనడుగుతున్నా...మీకున్న సంఖ్య ఎంత? మీరు ఎట్లా మేయర్ అవుతారు?

బీజేపీ కార్పొరేటర్లను కూడా ప్రలోభపెట్టాలని చూస్తున్నారులి

కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రలోభాలను బీజేపీ కార్పొరేటర్లు ఛీత్కరిస్తున్నారు

కరీంనగర్ లో కలిసి ఉండాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు తీసుకున్న నిర్ణయం... ఆ పార్టీల రాష్ట్ర నాయకత్వాల నిర్ణయమా? స్థానిక నేతల అభిప్రాయమా? స్పష్టం చేయాలి

ఈ అండర్ స్టాండింగ్ కారణంగానే ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్, ఈ ఫార్ములా రేసు, కాళేశ్వరం కేసుల్లో ఆధారాలున్నా కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేయడం లేదా?

కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందం జరిగింది

ఇది గమనించే ప్రజలు బీజేపీని ఆశీర్వదించారు

గెలిచిన ఇండిపెండెంట్లు సైతం మంచి ఆలోచనతో బీజేపీలో చేరుతున్నారు

అయినా కుట్రలు, కుతంత్రాలు చేసి మేయర్ పదవి బీజేపీకి దక్కకుండా చేయాలనుకుంటున్నారు

కాంగ్రెస్, బీఆర్ఎస్ లను హెచ్చరిస్తున్నా... బిడ్డా... ప్రజా తీర్పుకు భిన్నంగా కుట్రలు చేస్తే కరీంనగర్ నుండే మీ అంతు చూస్తా

బీజేపీ శక్తి ఏందో... కరీంనగర్ ప్రజల దమ్మేందో చూపిస్తాం

ఒక్కొక్కరిని రోడ్లపై ఉరికిస్తాం...

ప్రజాతీర్పును కాలరాస్తే... కరీంనగర్ లో ఒక్క కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతను తిరగనీయను

కరీంనగర్ వేదికగానే కాంగ్రెస్ హామీల సంగతి చూస్తాం

## 10వేల కండోమ్స్ 3 రోజుల్లో ఖతం



న్యూ డిల్లి ఫిబ్రవరి 14 శీతాకాల ఒలింపిక్స్-2026లో కండోమ్స్ కొరత ఏర్పడింది. 2900 మంది అథ్లెట్స్ కోసం 10వేల ప్యాకెట్లను సిద్ధం చేయగా 3 రోజుల్లోనే షెల్ఫులు ఖాళీ అయ్యాయి. ఈ ఊ హించని పరిణామంతో, విమర్శలు రాకుండా వెంటనే స్టాక్ తెప్పిస్తున్నట్లు ఇటలీ అధికారులు వెల్లడించారు. ఆరోగ్యకర లైఫ్ ను ప్రోత్సహించేలా ఒలింపిక్స్లో చాలా ఏళ్లుగా గర్భనిరోధకాలు అందిస్తున్నారు. కరోనా సమయంలో మాత్రం వీటికి బ్రేక్ పడింది.

## కార్మిక,రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు రద్దుయ్యే వరకు ఉద్యమాలు ఆగవు

### సీపీఐ (ఎమ్ ఎల్) సీపీ రెడ్డి పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి బుద్ద సత్యనారాయణ పిలుపు



సూర్యాపేట ఫిబ్రవరి 14 కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నది , ఆ విధానాలను వెన్నకి తీసుకుని వరకు తమ పోరాటం ఆగదని , సీపీఐ ( ఎమ్ ఎల్) సీపీ రెడ్డి పార్టీ జాతీయ కమిటీ అధికార ప్రతినిధి బుద్ద సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు,మోడీ తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రాష్ట్ర లో అమలు చెయ్యబొమశీ టూ అసెంబ్లీ లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు , రాష్ట్రశీ లొ సమ్మె అంచనాలకు మించి జరిగిందన్నారు , మున్సిపల్ ఎన్నికలు ఉన్నపటికీ కేంద్ర ప్రభుత్వ విధానాల పట్ల లక్ష లాదిమంది కార్మికులు, శ్రామికులు తమ అసంతృప్తి నీ, ఆగ్రహం వెలిబుచ్చారు సమ్మె ను జయప్రదం చేసినా అన్ని సంఘాలకు అభినందలు తెలిపారు, అమెరికా తో మిత్రత్వం పేరుతో మోదీ భారత దేశాన్ని విధ్వంసం వైపు నడిపిస్తూ, లొంగుబాటు వైఖరిని ప్రదర్శిస్తున్నారని మండి పడ్డారు రాబోయే రోజుల్లో ప్రజా ఉద్యమాలను తీవ్రతరం చేయాలన్నారు

## బీసీలకే సింహాభాగం

### బడ్జెట్ కేటాయింపులపై మంత్రి సవిత

### సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు




అమరావతి : బీసీల అభ్యున్నతి పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ది మరోసారి రుజువైందని, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో వెనుకబడిన వర్గాల సంక్షేమానికి చరిత్రలో కనీవినీ ఎరుగని కేటాయింపులు చేశారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆనందం వ్యక్తంచేశారు. మూడు కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత ప్రవేశ పెట్టిన మూడు బడ్జెట్లోనూ నిధుల కేటాయింపులు పెంచుకుంటూ వెళుతున్నామన్నారు. నూతన బడ్జెట్ లో ఆదరణ 3.0 పథకానికి మరో రూ.1000 కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తంచేశారు. 2026-27 బడ్జెట్ లో రూ.51,021 లక్షల కోట్లు బీసీ సంక్షేమానికి కేటాయించినందుకు సీఎం చంద్రబాబుకు, మంత్రి పయ్యావులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడారు. 2026-27 బడ్జెట్ అన్ని వర్గాల వారికి అనుకూలమైనదన్నారు. ముఖ్యంగా బీసీల ఉన్నతికి బడ్జెట్ లో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. 2024-25 బడ్జెట్ లో రూ.39,007 కోట్లు, 2025-26 బడ్జెట్ 47,456 కోట్లు, 2026-27 బడ్జెట్లో 51,021 కోట్లు కేటాయించారన్నారు. అందులో ఈడబ్ల్యూఎస్ సంక్షేమానికి రూ.10,669 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. 2025-26లో రూ.10,614 కోట్లు, 2024-25లో రూ.10,273.80 కోట్లు కేటాయించామన్నారు. నూతన బడ్జెట్లోనూ ఆదరణ 3.0 పథకానికి మరో రూ.1000 కోట్లు, చేనేతలకు, సెల్లూన్లకు ఉచిత విద్యుత్ కోసం రూ.150 కోట్లు, రూ.50 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. ఇలా ఏటా బీసీ సంక్షేమానికి నిధులు కూటమి ప్రభుత్వం కేటాయింపులు పెంచుతూ వస్తోందన్నారు. చరిత్రలో ఎరుగని విధంగా, సింహాభాగం నిధులు బీసీల సంక్షేమానికి కేటాయించామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ ఇటువంటి కేటాయింపులు చేయలేదన్నారు. రాయలసీమ ను గ్లోబల్ హార్టీ కల్చర్ గా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం రూ.30 వేల కోట్లు కేటాయిస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరేలా బడ్జెట్ ను రూపకల్పన చేశామన్నారు. వ్యవసాయానికి, పారిశ్రామిక రంగానికి కూడా ప్రాధాన్యమిస్తూ బడ్జెట్ లో నిధులు కేటాయించామన్నారు, బీసీల పట్ల కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సీఎం చంద్రబాబుకు, ఆర్థిక మంత్రి పయ్యావులకు మంత్రి సవితకు ఆ ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు.

## రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో జిల్లాకు, జోగులాంబ జోన్కు మంచి పేరు తీసుకురావాలి

### జిల్లా ఎస్పీ డి.జానకి



మహబూబ్ నగర్ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్లో పాల్గొనబోయే మహబూబ్ నగర్ జిల్లా క్రీడాకారులు మహబూబ్నగర్ జిల్లాకు మరియు జోగులాంబ జోన్కు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ డి.జానకి ఆకాంక్షించారు.

ఫిబ్రవరి 17 నుండి హైదరాబాద్లో ప్రారంభమయ్యే రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్కు ఎంపికైన క్రీడాకారులను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, క్రీడలు కేవలం పోటీలు మాత్రమే కాకుండా పోలీస్ శాఖలోని క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సహనశక్తి మరియు నాయకత్వ లక్షణాలను ప్రతిబింబించే వేదిక అని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు జిల్లా ఎస్పీ స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్ సూట్లు, స్పోర్ట్స్ షూస్ అందజేశారు. క్రీడాకారులు సరైన సాధనతో, పూర్తి నిబద్ధతతో పోటీల్లో పాల్గొని మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. రాష్ట్ర స్థాయి వేదికపై పాల్గొనే ప్రతి క్రీడాకారుడు తన వ్యక్తిగత ప్రతిభతో పాటు జిల్లా మరియు జోన్ ప్రతిష్ఠను ప్రతిబింబిస్తాడని స్పష్టం చేశారు. గెలుపు లక్ష్యంగా కఠిన సాధన చేయాలని, నిరంతర శిక్షణ, క్రమశిక్షణ, మానసిక దృఢత్వం విజయానికి మూలాధారాలని పేర్కొన్నారు. మైదానంలో చూపే ప్రతీ ప్రదర్శన పోలీస్ శాఖ ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొంటూ, క్రీడాస్ఫూర్తితో, సంపూర్ణ నిబద్ధతతో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలలో మెరుగైన ఫలితాలు సాధించి జిల్లాకు మరియు జోన్కు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఆర్ఐలు అడ్మిన్ కృష్ణయ్య, నగేశ్, సత్యం మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

## నకిలీ మందులను అరికట్టాలి

### పిడుగురాళ్లలో సిపిఐ పార్టీ నాయకులు నిరసన



పిడుగురాళ్ల, దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న మెడికల్ మాఫియా ప్రజల ఆరోగ్యంతో జీవించే హక్కు పై పరోక్ష దాడి కొనసాగిస్తూ ఉందని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఖండించింది. దేశవ్యాప్తంగా సిపిఐ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో పిడుగురాళ్ల పట్టణంలోని డ్రగ్ ఇన్స్పెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న సీపీఐ పార్టీ నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న మెడికల్ మాఫియా ప్రజలు ఆరోగ్యంతో జీవించే హక్కు పై పరీక్ష దాడి కొనసాగిస్తుందని అన్నారు. నాణ్యతలేని బోగస్మందులు మరియు విచ్చలవిడిగా మార్కెట్లో ప్రవేశించి వేలాదిమంది ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నడుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్య పరిస్థితులపై ప్రభావితం చూపుతున్న నకిలీ మందులను అరికట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వారు మాట్లాడుతూ బోగస్ మరియు నాణ్యత లేని మందులపై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక దాడులు నిర్వహించాలని, డ్రగ్ కంట్రోల్ వ్యవస్థను బలోపేతం చేసి నకిలీ మందులు అమ్మే వారిపై కఠినంగా శిక్షించాలని, కార్పొరేట్ హాస్పిటల్స్ దందాపై స్వతంత్ర విచారణ కమిటీలు ఏర్పాటు చేయాలని, ల్యాబ్ సెంటర్ల టెస్టుల ధరలో నియంత్రణ చేయాలని, అవసరమైన మందులను ప్రజలకు సరైన ధరలకు అందజేయాలని, అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డ్రాగ్ ఇన్స్పెక్టర్ల ఖాళీలను వెంటనే ప్రభుత్వం భర్తీ చేయాలని డిమాండ్ చేస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, పల్నాడు ఏరియా కార్యదర్శి షేక్ హుస్సేన్, గురజాల నియోజకవర్గం కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, పిడుగురాళ్ల మండల కార్యదర్శి అక్కినపల్లి బాలయ్య, పిడుగురాళ్ల పట్టణ కార్యదర్శి షేక్ కరీముల్లా, పార్టీ నాయకులు మిర్యాల పుల్లయ్య, పణి దెం కోటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎస్కే నజీర్, మాచవరం మండలం నాయకులు కె. సైదారావు, ఏఐవైఎఫ్ నాయకులు కాశీమల ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటీ కారిడార్లో రోడ్ల విస్తరణకు కసరత్తు:

## అధికారుల సంయుక్త పరిశీలన

ఐటీ కారిడార్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడమే లక్ష్యంగా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో రోడ్డు విస్తరణ పనులపై దృష్టి సారించారు.సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కీలక మార్గాల్లో నెలకొన్న బాటిల్నెక్లను తొలగించి, రోడ్డు భద్రతను మెరుగుపరిచేందుకు ఈరోజు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన ఐఏఎస్., జలమండలి అధికారి అశోక్ రెడ్డి ఐఏఎస్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ భోర్కడే హేమంత్ సహదేవరావు ఐఏఎస్, ట్రాఫిక్-1 డీసీపీ జె. రంజన్ రతన్ కుమార్తో పాటు టీజీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం. కవిత వివిధ శాఖల ఉన్నతాధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యంగా మాదాపూర్ లెమన్ ట్రీ హోటల్ నుంచి సైబర్ టవర్స్ వరకు, అక్కడి నుంచి మెడికోవర్ ఆస్పత్రి వరకు ఉన్న రహదారులను అధికారులు పరిశీలించారు. మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గం చెరువు, నెక్టర్ గార్డెన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సాఫీగా సాగకుండా అడ్డుపడుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రహదారి వెడల్పునకు ఆటంకంగా ఉన్న ఆక్రమణలు, విద్యుత్ స్తంభాలు, నీటి పైప్లైన్ల వంటి యుటిలిటీల మార్పుపై ఆయా శాఖల మధ్య సమన్వయం ఉండాలని అధికారులు ఆదేశించారు. పనులు జరిగే సమయంలో వాహనదారులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ విస్తరణ పనుల ద్వారా ఐటీ కారిడార్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటమే కాకుండా, ప్రయాణికుల భద్రత కూడా పెరుగుతుందని అధికారులు వెల్లడించారు.

# జోష్ నింపుతున్న ఆత్మీయ కలయిక...

విజయవాడ, ఫిబ్రవరి 14, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో యువనేత, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సరికొత్త రాజకీయ ఒరవడికి శ్రీకారం చుట్టారు. కేవలం పాలన, రాజకీయాలకే పరిమితం కాకుండా, ప్రజాప్రతినిధులతో కుటుంబ సభ్యుల తరహా బంధాన్ని పటిష్టం చేసుకునే దిశగా ఆయన అడుగులు వేస్తున్నారు. "ఆత్మీయ కలయిక ? ఇల్లే వేదిక" పేరుతో లోకేష్ చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.సాధారణంగా రాజకీయ భేటీలు అంటే వ్యూహాలు, ప్రతివ్యూహాలు, విమర్శలు, ప్రతివిమర్శలతో కూడి ఉంటాయి. కానీ, లోకేష్ నిర్వహిస్తున్న ఈ సమావేశాలు అందుకు పూర్తి భిన్నం. ఉండవల్లిలోని తన నివాసంలో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతినిధులను వారి కుటుంబ సభ్యులతో సహా ఆహ్వానించి, ఒక ఆత్మీయ విందును ఏర్పాటు చేయడం ద్వారా లోకేష్ అందరినీ ఆశ్చర్యపరిచారు.

ఈ నూతన సంప్రదాయానికి తొలి వేదికగా మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం నిలిచింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న తరుణంలో, ఎమ్మెల్యేలు తమ కుటుంబాలతో సహా లోకేష్ నివాసానికి తరలివచ్చారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కాగిత కృష్ణప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, వర్ల కుమార్ రాజా, బోడే ప్రసాద్, చీఫ్ విప్ జి.వి. ఆంజనేయులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. పార్లమెంటు సమావేశాల వల్ల ఎంపీ బాలశౌరి, విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా వెనిగండ్ల రాము ఈ సమావేశానికి హాజరుకాలేకపోయారు.ఈ కలయికలో లోకేష్ చూపిన ఆతిథ్యం ప్రత్యేకంగా నిలిచింది. తన నియోజకవర్గమైన మంగళగిరిలోని చేనేత కార్మికుల నైపుణ్యానికి గుర్తింపుగా, వచ్చిన ఆడపడుచులందరికీ మంగళగిరి పట్టుచీరలను బహుకరించి తన ఆత్మీయతను చాటుకున్నారు. ఇది కేవలం బహుమతి మాత్రమే కాదు, తన నియోజకవర్గ నేతన్నల పట్ల ఆయనకున్న గౌరవానికి, అతిథుల పట్ల ఉన్న మర్యాదకు నిదర్శనం.ఈ సమావేశంలో కేవలం మాటలు, ముచ్చట్లే కాదు.. బాధ్యత కూడా కనిపించింది. గతంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఇచ్చిన వినతులపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు, వాటి తాజా స్థితిగతులపై ఒక సమగ్ర నివేదికను లోకేష్ వారికి అందజేశారు. సమస్యలు చెప్పడమే కాదు, వాటి పరిష్కారం ఎక్కడి వరకు వచ్చిందో అధికారికంగా నివేదిక ఇవ్వడం లోకేష్ పనితీరులోని పరిణతిని చూపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారుఈ తరహా సమావేశాల వల్ల పార్టీ నాయకులను కేవలం రాజకీయ యంత్రాలుగా కాకుండా, ఒక కుటుంబంగా భావించడం వల్ల వారిలో పార్టీ పట్ల విధేయత, ఉత్సాహం పెరుగుతాయి. చంద్రబాబు క్రమశిక్షణకు మారుపేరైతే, లోకేష్ ఆ క్రమశిక్షణకు 'ఆత్మీయత'ను జోడించి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంటున్నారు. ఎమ్మెల్యేల నుంచి నేరుగా నియోజకవర్గ సమస్యలను తెలుసుకోవడం, వాటిపై ఫీడ్ బ్యాక్ ఇవ్వడం ద్వారా పాలనలో వేగం పెరుగుతుంది. ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులతో మమేకం కావడం ద్వారా, నాయకులకు ఇంటి నుంచే పూర్తి మద్దతు లభించేలా చేయడం లోకేష్ దార్శనికతకు అద్దం పడుతోందిలోకేష్ చేపట్టిన ఈ ఆత్మీయ కలయిక కార్యక్రమం టీడీపీలో కొత్త జోష్ నింపుతోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసే లోపు రాష్ట్రంలోని అన్ని పార్లమెంటు నియోజకవర్గాల నేతలతో ఇటువంటి భేటీలు జరగనున్నాయి. ఇది కేవలం ఒక డిన్నర్ మీటింగ్ మాత్రమే కాదు, భవిష్యత్తు నాయకత్వ పటిమను, పార్టీ పట్ల లోకేష్‌కు ఉన్న చిత్తశుద్ధిని చాటిచెప్పే ఒక రాజకీయ సంస్కరణగా చెప్పవచ్చు.

ఇక మండలిలో అయితే. పాలనను గాడిలో పెడుతూ అభివృద్ధితోపాటు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోంది కూటమి. అయితే అంతకుముందు ఉన్న ప్రభుత్వం పెండింగ్లో పెట్టిన చాలా వాటిని పూర్తిచేస్తూ.. కొత్త వాటికి చెల్లింపులు చేస్తోంది.

తాజాగా విద్యార్థులకు సంబంధించిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు 1200 కోట్ల రూపాయలను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేష్ శాసనమండలిలో కీలక ప్రకటన చేశారు. జగన్ సర్కార్ 4వేల కోట్లను బకాయి పెట్టిందని గుర్తు చేశారు. దీనిపై శాసనమండలిలో వైసిపి పక్ష నేత బొత్స సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రి లోకేష్ తీరును తప్పుపడుతూ.. సభ నుంచి వాకౌట్ చేశారు.ప్రభుత్వ విద్యావ్యవస్థకు సంబంధించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనమండలిలో పలు అంశాలను ప్రస్తావించింది.. ఈ క్రమంలో విశాఖలో గీతం విద్యాసంస్థల భూ కేటాయింపులతో పాటు వివిధ పరిశ్రమలు, సంస్థలకు భూ కేటాయింపుల విషయమై బొత్స ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేష్ స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా భూ కేటాయింపులు జరిపితే.. దానిని నిరూపిస్తే.. మంత్రి పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో మంత్రిగా బొత్స ఉండే సమయంలో విజయనగరం జిల్లాలో ఆయన కుటుంబ సభ్యులు.. కోట్లాది రూపాయల భూములను కారు చౌకగా కొట్టేసారని మీడియాలో కథనాలు వచ్చాయి. దీనిపై శుక్రవారం చర్చ జరిగే అవకాశం ఉందని ప్రచారం నడిచింది. ఇటువంటి పరిస్థితుల్లో మంత్రి బొత్స ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ వైసిపి సభ్యులతో కలిసి శాసనమండలిని వాకౌట్ చేయడం విశేషం. అంతకుముందు సభలో విద్యావ్యవస్థ పై జరిగిన చర్చలో బొత్సతో మంత్రి నారా లోకేష్ వాగ్వాదానికి దిగారు.వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో మంత్రిగా పనిచేశారు బొత్సపాఠశాల విద్యా శాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహించారు. ఈ క్రమంలో కొన్ని రకాల చెల్లింపులు, సక్రమంగా జరగలేదు. ప్రధానంగా ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయలను అప్పటి జగన్ సర్కార్ విద్యార్థులకు అందించకుండా ఇబ్బంది పెట్టింది. ప్రైవేటు కాలేజీల్లో చేరే విద్యార్థులకు సైతం ఈ ఫీజు రియంబర్స్మెంట్ ఇస్తామని అప్పట్లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించింది. దీంతో సామాన్య పేద విద్యార్థులు సైతం ప్రైవేట్ కాలేజీల్లో చేరారు. కానీ ఫీజు రీయంబర్స్మెంట్ మాత్రం చెల్లించలేదు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెట్టాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఫీజు రియంబర్స్మెంట్ నిధులను ప్రాధాన్యత క్రమంలో విడుదల చేస్తూ వస్తోంది. నిన్ననే 1200 కోట్ల రూపాయలను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే విషయాన్ని లోకేష్ ఈరోజు శాసనమండలిలో ప్రస్తావించేసరికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలు తట్టుకోలేకపోయారు. అందుకే బొత్స సభను వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటన చేసి బయటకు వెళ్లిపోయారు.

# మూడేళ్ల ముందు నుంచే వర్క్ షురూ...

విజయవాడ, ఫిబ్రవరి 14, ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు సమీపిస్తోంది. 2024 జూన్ లో వచ్చిన ఫలితాల్లో కూటమి ఏకపక్ష విజయం సాధించింది. 164 స్థానాల్లో గెలుపొందింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నేతలంతా ఓడిపోయారు. అయితే మరోసారి అదే పట్టును కొనసాగించాలని చూస్తోంది కూటమి. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కీలక నేతలు ఓడిపోయిన నియోజకవర్గాలపై ఇప్పుడు దృష్టి పెట్టింది. మరోసారి అక్కడ కూటమి గెలిచేలా గట్టి ప్రణాళికలు వేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో చాన్స్ ఇవ్వకూడదని భావిస్తోంది. అందుకే వైసీపీ కీలక నేతల నియోజకవర్గాల విషయంలో గట్టి పట్టుదలతోనే ఉంది. తాజాగా జరిగిన కలెక్టర్ల రివ్యూలో ఆ జిల్లా మంత్రులకు సైతం సీఎం చంద్రబాబు నిర్దేశించినట్లు తెలుస్తోంది. అభివృద్ధిని చేయడం ద్వారా వైసీపీ కీలక నేతలకు చాన్స్ లేకుండా చూడాలన్నది చంద్రబాబు ఆలోచనగా సమాచారం.వైసీపీ కీలక నేతలుగా చాలామంది ఉన్నారు. అటువంటివారు మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయారు. మరోసారి వారు గెలవకుండా ఉండాలని చూస్తున్నారు చంద్రబాబు. అందులో భాగంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్నాథ్, పేర్ని నాని, కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్, అంబటి రాంబాబు, జోగి రమేష్, ఆర్కే రోజా వంటి వారు మరోసారి అసెంబ్లీకి రాకుండా చేయాలన్న లక్ష్యంతో ఉన్నట్టు కనిపిస్తున్నారు. వారి విషయంలో జిల్లా మంత్రులతో పాటు ఎమ్మెల్యేలకు కీలక టాస్కులు ఇచ్చారు. అభివృద్ధి పరంగా చేపట్టాల్సిన అంశాల గురించి ఆయా జిల్లా కలెక్టర్లతో చర్చించారు సీఎం చంద్రబాబు.2024 అసెంబ్లీ ఎన్నికల్లో నాటి జగన్ క్యాబినెట్లో ఉన్న వారంతా ఓడిపోయారు. ఒక్క పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాత్రమే గెలిచారు. అయితే ఈసారి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కూడా ఓడించాలని చూస్తున్నారు చంద్రబాబు. ఎంతవరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 40 శాతం ఓటు బ్యాంకు గురించి ఆలోచన చేస్తోంది తప్ప.. ప్రధాన నియోజకవర్గాల్లో పట్టు తప్పుతోందని గ్రహించడం లేదు. అయితే ఈసారి జగన్ మోహన్ రెడ్డి సైతం సీనియర్లను బరిలో దించే అవకాశం ఉంది. అయితే అటువంటి నియోజకవర్గాలను ఎంపిక చేసుకున్న చంద్రబాబు ఎమ్మెల్యేలకు కీలక సూచనలు చేస్తున్నారు. అధికార యంత్రాంగం పరంగా కూడా అక్కడ ప్రత్యేక అభివృద్ధి పనులు చేపట్టాలని భావిస్తున్నారు. తద్వారా ఆ నియోజకవర్గాలను తిరిగి నిలబెట్టుకోవాలని చూస్తున్నారు. తాజాగా కలెక్టర్ల సదస్సులో దీనిపైనే కీలక ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో వారు మరోసారి గెలవకూడదు అన్నది చంద్రబాబు ప్రణాళికగా తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# కొరియన్ లవ్ గేమ్...

# ఢిల్లీలోనే 800 మంది మిస్సింగ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14, ధ్రువ సినిమా చూశారా.. అందులో రామ్ చరణ్ శరీరంలో ఒక బగ్ ఉంటుంది. దాని ద్వారా అరవింద్ స్వామి రామ్ చరణ్ మాట్లాడిన మాటలు మొత్తం వింటూ ఉంటాడు. అతడు చేసే పనులకు కౌంటర్ ఇస్తూ ఉంటాడు. రామ్ చరణ్ ను చాలా ఇబ్బంది పెడుతూ ఉంటాడు. అటువంటి బగ్ మన శరీరంలో ఒకటి ఉంటే.. అది కూడా ఒక ఫోన్ రూపంలో ఉంటే.. ఎలా ఉంటుంది.. చదువుతుంటే ఆందోళన కలుగుతుంది కదూ.. మనదేశంలో ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో ఘజియాబాద్ నగరంలో ముగ్గురు సోదరీమణులు ఒకరి వెంట ఒకరు బలవంతంగా చనిపోయారు. దీని వెనుక భయంకరమైన కారణాలు ఉన్నాయి.రియన్ సినిమాలు అంటే చాలా ఇష్టం. కొరియన్ డ్రామాలు బాగుంటాయి. కొరియన్ సినిమాలలో నేపథ్య సంగీతం అద్భుతంగా ఉంటుంది. ప్రారంభం నుంచి చివరి వరకు కొరియన్ సినిమాల్లో డ్రామా.. ఉత్కంఠ..ముని వేళ్ళ మీద నిలబెట్టే ఉద్వేగం ఇలా చాలా ఉంటాయి. అందువల్లే చాలామంది కొరియన్ సినిమాలను ఇష్టపడుతుంటారు.ప్రపంచానికి భిన్నంగా.. ఆలోచించడం కొరియన్ ప్రజలకు ఇష్టం. టెక్నాలజీతో వారు ఒక ఆట ఆడుకుంటారు. అయితే ఇతరుల భావోద్వేగాలను తమ గుప్పెట్లోకి తీసుకోవడం చాలా మంది కొరియన్ ప్రజలకు అలవాటు. దాన్ని ఒక ఆనందంగా వారు భావిస్తుంటారు. ప్రపంచం మొత్తం తమ చేతిలో ఉంది అని అనుకుంటారు. అందువల్లే కొరియన్ నిపుణులు కొంతమంది గేమ్స్ రూపొందించారు. ఈ గేమ్స్ కు సంబంధించిన ఏ వ్యవహారం కూడా అధికారికంగా బయటికి కనిపించదు. తయారీదారులు కూడా వారి వివరాలు బయటపెట్టరు. రకరకాల మాధ్యమాలలో తమ గేమ్స్ గురించి ప్రమోషన్ చేసుకుంటారు. ముఖ్యంగా యుక్త వయసు పిల్లల్ని లక్ష్యంగా చేసుకొని ఏదో ఒక రూపంలో వారికి దగ్గరవుతారు."నువ్వు స్మార్ట్ గా ఆలోచిస్తున్నావ్. నీ కళ్ళల్లో స్పార్క్ కనిపిస్తోంది. మీ అమ్మానాన్న పెట్టిన పేర్లతోనే నువ్వు ఉంటావా.. ఈ కొరియన్ పేరు ట్రై చెయ్.. అసలు నువ్వు స్కూల్ కి ఎందుకు వెళ్లాలి.. ఈరోజు కాలేజీకి ఎందుకు బంక్ కొట్టకూడదు.. నువ్వు ఒంటరిగా ఉంటూ జీవితాన్ని ఎందుకు ఆస్వాదించకూడదు.. ఈ నాలుగు గోడల మధ్యలోనే నువ్వు స్వేచ్ఛను ఎందుకు కోరుకోకూడదు.. కొత్త కొత్త టాస్క్ లు చేసేయ్. నీకు ప్రతిదీ ఉద్వేగంగా ఉంటుంది. చదువుకుంటే మహా అయితే ఉద్యోగం మాత్రమే చేస్తావు. ఒక కింద బానిసలాగా పనిచేయడం నీకు అవసరమా" ఇలా రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతుంటారు.టీనేజ్ పిల్లలలో భావోద్వేగాలు ఎక్కువగా ఉంటాయి. అదే సమయంలో కొరియన్ గేమ్స్ నిర్వాహకులు యూత్ పిల్లలను రెచ్చగొడుతుంటారు. ఒకరకంగా వారిని తమ ఆధీనంలోకి తీసుకుంటారు. ప్రతిరోజు ఒక టాస్క్ ఇస్తూ ఉంటారు. ఆ టాస్క్ పూర్తి చేసిన తర్వాత నువ్వు ప్రపంచంలోనే ధీరుడువి.. నీలాంటి శక్తివంతుడు ఎవరూ లేరు.. ఈ ప్రపంచంతో నీకే సంబంధం.. నీకై నువ్వు ఒంటరిగా వచ్చావు కదా.. ఒంటరిగా వెళ్తే తప్పేంటి అన్నట్టుగా యువతలో లేనిపోని ఉద్వేగాలను నూరిపోస్తుంటారు.ఆ తర్వాత వారిని తమ ఆధీనంలోకి పూర్తిగా తీసుకున్న తర్వాత.. ఈ ప్రపంచం తో నీకు సంబంధం లేదు.. నువ్విక వెళ్ళిపోవచ్చు.. ఈ టాస్క్ లో కనుక నువ్వు చనిపోతే విజేతవు.. అంటూ ఒక రకమైన ఉద్వేగాన్ని రుద్దుతారు. ఫలితంగా ఇదంతా నిజమే అని భ్రమపడి పిల్లలు.. కొరియన్ గేమ్స్ నిర్వాహకులు చెప్పినట్టుగా చేస్తుంటారు. చివరికి వారు తన ప్రాణాలను కూడా కోల్పోతుంటారఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్ నగరంలో జరిగింది పైతరహా దారుణమే. అయితే ఇప్పటికీ ఈ విషయంలో ఇంకా కొన్ని తెలియని నిజాలు బయటికి రావాల్సి ఉంది. ఈ ఘటనలో ఆ ముగ్గురు పిల్లల తండ్రి చెబుతున్న మాటలు పొంతన లేకుండా ఉన్నాయి. ఇంకా దర్యాప్తు సాగుతుంది కాబట్టి ఈ వ్యవహారంలో కొన్ని విషయాలను బయటకు చెప్పడం సాధ్యం కావడం లేదు.ఘజియాబాద్ ఘటన తర్వాత కొరియన్ గేమ్స్ పై చర్చ మొదలైంది. ముఖ్యంగా బ్లూ వేల్ గేమ్ ను బ్యాన్ చేయాలని డిమాండ్ కూడా వ్యక్తం అవుతుంది. వేల్స్ లో బ్లూ వేల్స్ కొన్ని సందర్భాలలో ఒంటరిగా ఉంటాయి. ఆ తర్వాత ఎవరికి చెప్పకుండా తమను తాము బలవంతంగా చంపేసుకుంటాయి. కొరియన్ గేమ్ నిర్వాహకులు కూడా తమ రూపొందించిన ఆటకు బ్లూవేల్ గేమ్ అని పేరు పెట్టారు. అందులో బ్లూ వేల్ మాదిరిగానే చనిపోవాలని టాస్క్ ఇస్తుంటారు.. ఇది పిల్లల మెదడు పైన ఒక రకమైన ప్రభావాన్ని చూపుతుంది. తమకు తెలియకుండా తామే ఆత్మహత్య చేసుకునే విధంగా పురిగొల్పుతుంది.ఘజియాబాద్ ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత ఢిల్లీలో దాదాపు 800 మంది దాకా యువతీ యువకులు మిస్సింగ్ అయ్యారని జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. దీంతో దేశవ్యాప్తంగా కలకలం నెలకొంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు స్పందించారు. ఘజియాబాద్ ఘటన విషయంలో ఉత్తర ప్రదేశ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని.. ఢిల్లీలో 800 మంది యువతీ యువకులు మిస్సింగ్ అవ్వలేదని.. ఇటువంటి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తిలోకి తీసుకొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏది ఏమైనప్పటికీ తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా పిల్లలు ఫోన్లలో ఏం చేస్తున్నారో..ఏం చూస్తున్నారో కనిపెట్టుకొని ఉండాలి.

# కోమటిరెడ్డి ధైర్యం ఏంటీ...

నల్గొండ, ఫిబ్రవరి 14,తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలనే సాధించింది. ఈ విజయంతో సంబరాల ఊపులో ఉన్న టైంలోనే ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు మంత్రి పదవి ఇవ్వాలని లేకుంటే డైరెక్ట్‌గా సీఎం కుర్చీనే టార్గెట్ లాక్కుంటానని హెచ్చరించారు. ఇప్పుడే కాదు ఆయన గతంలో కూడా ఇలాంటి కామెంట్స్ చాలా చేశారు. తనను పార్టీలోకి తిరిగి తీసుకున్నప్పుడు మంత్రి పదవి ఆఫర్ చేశారని ఇప్పుడు అది కావాలంటూ చాలా కాలం నుంచి పార్టీ నాయకత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. అయినా ఆయన్ని ఎవరూ పిలిచి మాట్లాడటం లేదు. ఆయన కామెంట్స్ ఆగటం లేదు. ఇప్పుడు మరోసారి కామెంట్స్‌తో వార్తలకెక్కారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడు. అయితే ప్రతిపక్షంలో ఉన్న టైంలో ఆయన కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. తర్వాత అక్కడి నుంచి 2023 ఎన్నికల టైంలో మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రి పదవి హామీతోనే పార్టీలోకి తీసుకొచ్చినట్టు ఆయన చెప్పుకుంటున్నారు. ఆయన సోదరుడైన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రస్తుతం మంత్రిగా ఉన్నారు. అందుకే ప్రస్తుతం ఉన్న లెక్కల ప్రకారం రాజగోపాల్ రెడ్డికి మంత్రిపదవి ఇవ్వడం సాధ్యం కాదు. అయినా నాకు మంత్రి పదవి కావాల్సిందేనంటూ మొండికేస్తున్నారు. మంత్రి పదవి ఎలాగైనా సాధించుకోవాలని సమయం వచ్చినప్పుడల్లా ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ వస్తున్నారు రాజగోపాల్ రెడ్డి. రేవంత్ రెడ్డి టార్గెట్‌గా బాణాలు సంధిస్తూనే ఉన్నారు. ఆయన మాటలను ఎవరూ సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఒకట్రెండు సార్లు పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలిచి మాట్లాడింది. కానీ వాటిని పట్టించుకోవడం లేదు. అందుకే రోజు రోజుకు ఆయన విమర్శల డోసు పెరుగుతూనే ఉంది. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై స్పందించిన రాజగోపాల్ రెడ్డి మరోసారి మంత్రి పదవి అంశాన్ని ప్రస్తావించారు. పార్టీలోకి తీసుకొని వచ్చినప్పుడు తనకు ఇచ్చిన మాట ప్రకారం మంత్రిపదవి ఇవ్వాలని రాజగోపాల్ డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే డైరెక్ట్‌గా సీఎం అవుతానంటూ హెచ్చరించారు. ఇకపై పదవి కావాలని అడుక్కోవడం ఉండదని నేరుగా సమయం వచ్చినప్పుడు సీఎం సీట్లో కూర్చోవడమే ఉంటుందని హెచ్చరించారు. కచ్చితంగా తనకు మంచి పదవి వస్తుందని కూడా నమ్మకం వ్యక్తం చేశారు. ఇలా మున్సిపల్ ఎన్నికల ఫలితాల రోజున ఇలాంటి అసంతృప్తి స్వరం వినిపించడంపై కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం కూడా సీరియస్‌గా ఉంటోంది. పదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటాను అంటూ గతంలో రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్‌పై కూడా ఇలానే రాజగోపాల్ రెడ్డి రియాక్ట్ అయ్యారు. ఇది కాంగ్రెస్ రూల్స్‌కు విరుద్ధమని పార్టీని వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చే ప్రయత్నాలు ఉన్నాయని ఎక్స్ వేదికగా విమర్శనాస్త్రాలు సంధించారు. గత ఆగస్టులో జరిగిన మంత్రివర్గ విస్తరణ టైంలో కూడా విమర్శలు చేశారు. ఆస్తులు అమ్మి పార్టీని గెలిపిస్తే తనను మోసం చేశారని మండిపడ్డారు. తనతోపాటు వచ్చిన వారికి మంత్రిపదవులు ఇచ్చారని తనను మాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటేనే రాజగోపాల్ రెడ్డికి పడటం లేదు. ఆయన వేర్వేరు పార్టీల నుంచి వచ్చిన వ్యక్తిని నేరుగా సీఎం సీటులో కూర్చోబెట్టడాన్ని తప్పుపడుతున్నారు. అందుకే సమయం వచ్చినప్పుడల్లా రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తున్నారు. తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకుంటుంది రేవంతే అనే భావనలో రాజగోపాల్ రెడ్డి ఉన్నారు. అధిష్ఠానం వద్ద ఏదో ఒకటి చెప్పి ముఖ్యమంత్రి పదవిని కాపాడుకుంటున్నారనే ఆలోచనలో ఉన్నారు. అందుకే సందర్భం ఏదైనా సరే రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తున్నారు. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. తనకు మంత్రి పదవి ఇవ్వకుంటే నీ కుర్చీ లాక్కుంటా అంటూ రేవంత్ రెడ్డికే పరోక్షంగా సవాల్ చేస్తున్నారు. రాజగోపాల్ రెడ్డి వ్యవహార శైలి పార్టీ రాష్ట్ర నాయకత్వానికి తలనొప్పిగా మారుతోంది.

ఓవైపు రాజగోపాల్ రెడ్డి, మరోవైపు జీవన్ రెడ్డి, ఇంకో వైపు జగ్గారెడ్డి లాంటి వాళ్లతో సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. ఇలాంటి విమర్శలు ప్రత్యర్థులకు ఆయుధాలుగా మారతాయని రాష్ట్ర నాయకత్వం ఎన్ని రకాలుగా చెబుతున్నా వీళ్లు మాత్రం తమ పంథం వీడటం లేదు. సోదరుడు వెంకట్‌రెడ్డి కేబినెట్‌లో ఉండగానే రాజగోపాల్ రెడ్డికి పదవి ఎలా లభిస్తుందని పార్టీలోని కొందరు నేతలు ప్రశ్నిస్తున్నారు. స్కూల్ పిల్లాడి మాదిరిగా మారం చేస్తున్నారని అంటున్నారు.

# ఇది టీడీపీ కాంగ్రెసా రాహుల్ గాంధీ కాంగ్రెసా

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



నల్గొండ మేము కష్టపడితే రేవంత్ రెడ్డి సీఎం అయి, ఇప్పుడు అహంకారంతో మాట్లాడుతున్నాడని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసారు. మేమందరం కలిసి కష్టపడితే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడు.. ఆయన అదృష్టం అది. ఇది టీడీపీ కాంగ్రెసా? రాహుల్ గాంధీ కాంగ్రెసా అని ప్రశ్నించారు.

140 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ చరిత్రలో రేవంత్ రెడ్డి అహంకారంతో నేనే పదేళ్లు ముఖ్యమంత్రిని అని మాట్లాడుతున్నాడు. రేవంత్ రెడ్డి ఏ పార్టీ నుండి వచ్చేసారి ముఖ్యమంత్రి అవుతాడు? రేవంత్ రెడ్డి ఏ పార్టీతో టచ్ లో ఉండి, ఎవరి మద్దతుతో ఇంకోసారి ముఖ్యమంత్రి అవుతాడని నిలదీసారు.

రేవంత్ రెడ్డి నేనే పదేళ్లు ముఖ్యమంత్రిని అని అనడం రాహుల్ గాంధీని, కాంగ్రెస్ పార్టీని, మమ్మల్ని అవమానించడమే. రేవంత్ రెడ్డి ఇలా మాట్లాడుతుంటే కాంగ్రెస్ మంత్రులు, టీపీసీసీ ప్రెసిడెంట్, అధిష్టానం ఎందుకు ఏం అనడం లేదని అన్నారు.

తెలంగాణలో ఉన్నది రేవంత్ కాంగ్రెసా ? రాహుల్ గాంధీ కాంగ్రెసా ?రేవంత్ రెడ్డి మాటలు విన్నప్పుడల్లా వినాశకాలే విపరీత బుద్ధి అనే సామెత గుర్తుకు వస్తుంది. తెలంగాణలో ఇప్పటికీ కూడా చంద్రబాబు నాయుడు మనుషుల, ఆంధ్రా పెత్తందారుల పెత్తనమే నడుస్తుందని అయన ఆరోపించారు.

# డీసీఎం ఢీకొని కానిస్టేబుల్ దుర్మరణం

డీసీఎం ఢీకొని కానిస్టేబుల్ దుర్మరణంతెలంగాణ : నల్గొండ జిల్లా చందనపల్లి వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మునుగోడు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ షేక్ తయ్యూబ్ (30) మృతిచెందాడు. మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో విధులు ముగించుకుని స్వగ్రామం నకిరేకల్‌కు బైక్‌పై వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన డీసీఎం వాహనం ఢీకొట్టడంతో తయ్యూబ్ అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందిన వెంటనే నల్లగొండ రూరల్ ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## సూర్యప్రభవాహనంపై శ్రీ సూర్యనారాయణస్వామి అభయం పరవశించిన భక్త జనం , ఫిబ్రవరి 15న రథోత్సవం

శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన శనివారం ఉదయం 8 గంటలకు ఆదిత్య మండలం సూర్యప్రభ వాహనంపై ఖడ్గం, గద, విల్లు ధరించి శ్రీ సూర్యరాయణస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.వాహనసేవ ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు చెక్క భజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవం కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

ఆయురారోగ్యప్రాప్తి :

సూర్యుడు సకల రోగ నివారకుడు, ఆరోగ్యకారకుడు, ప్రకృతికి చైతన్య ప్రదాత. ఔషధీపతి అయిన చంద్రుడు కూడా సూర్యతేజం వల్లనే ప్రకాశిస్తూ వృద్ధి పొందుతున్నాడు. ఈ వాహనంలో శ్రీవారి చుట్టూ ఉన్న సూర్యప్రభ సకల జీవుల చైతన్య ప్రభ. సూర్య మండల మధ్యవర్తి శ్రీమన్నారాయణుడే. అందుకే సూర్యుని సూర్యనారాయణుడు అని కొలుస్తున్నాం. ఇంతటి మహాతేజఃపూర్ణమైన సూర్యప్రభ వాహనంలో ఉండే సూర్యనారాయణుడిని దర్శిస్తే ఇతోధిక భోగభాగ్యాలు, సత్సంతాన సంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయి.

వాహన సేవలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఆలయ అర్చకులు బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధన శేఖర్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 15న రథోత్సవం

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో 8వ రోజైన ఆదివారం రథోత్సవం వైభవంగా జరుగనుంది. ఉదయం 6.30 గంటలకు స్వామివారు రథారోహణం చేస్తారు. ఉదయం 7.45 గంటలకు రథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి 7 నుండి 8 గంటల వరకు అశ్వవాహనంపై స్వామివారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు.

# రేవంత్ సత్తా చూపించిన ఎలక్షన్స్

వరంగల్, మార్చి 14, మనం ఇంట్లో అన్నం తింటున్నప్పుడు.. స్వేచ్ఛగా వ్యవహరించగలుగుతాం. ఎక్కడో ఒకచోట కూర్చుని ఆహారాన్ని లాగించేస్తూ ఉంటాం. అలాకాకుండా హోటల్లో తింటే ఒక పద్ధతి ప్రకారం వ్యవహరిస్తూ ఉంటాం. ప్రాంతం మారినప్పుడు..

తినే ఆహారం మారినప్పుడు ఆటోమేటిక్ గా మన వ్యవహార శైలిలో మార్పు వచ్చేస్తూ ఉంటుంది.పై ఉపోద్ఘాతం రాజకీయాలకు కచ్చితంగా వర్తిస్తుంది. ఉదాహరణకు ఒక ప్రాంతీయ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకుడు స్వేచ్ఛగా పనిచేసుకోగలుగుతాడు మంచి అనేది ఏదైనా జరిగితే తన ఖాతాలో వేసుకోగలుగుతాడు. నిర్ణయాలు తీసుకునే విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఉంటాడు.

తనే హై కమాండ్ కాబట్టి ఇంకొకరికి సమాధానం చెప్పకుండా.. అసలు సమాధానమే చెప్పాల్సిన అవసరం లేకుండా వ్యవహరిస్తూ ఉంటాడు.కానీ ఒక జాతీయ పార్టీలో పనిచేసే వ్యక్తికి ఇలా ఉండదు. అతడు ప్రతి ఒక్కరికి సమాధానం చెప్పాలి. తీసుకునే నిర్ణయాన్ని ముందుగానే వెల్లడించాలి. పార్టీకి ఇబ్బంది రాకుండా.. ప్రభుత్వానికి ఒత్తిడి ఎదురుకాకుండా చూసుకోవాలి. ప్రతికూలతలు ఎదురైనప్పుడు సమయమనం తో.. సానుకూలతలు వచ్చినప్పుడు ఆశావాహ దృక్పథంతో పనిచేయాల్సి ఉంటుంది.తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలు సాధించింది. ఏకపక్షమైన విజయాలు కాకుండా.. గట్టి పోటీ ఎదుర్కొని మెజారిటీ స్థానాలను దక్కించుకుంది. ఇదే సమయంలో ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో స్థానాలను దక్కించుకున్నాయి.రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు కాబట్టి ఫలితాలు అంతగా ఏకపక్షంగా లేవు. అదే ఒకవేళ ప్రాంతీయ పార్టీకి గనుక రేవంత్ రెడ్డి నాయకత్వం వహిస్తే ఫలితాలు మొత్తం ఏకపక్షంగా ఉండేది. క్షేత్రస్థాయిలో అనేక ప్రతికూలతలను అధిగమించి 2023లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చాడు రేవంత్ రెడ్డి. ఎన్నికల సభల్లో కూడా అన్ని తానై నడిచాడు. ఇప్పుడు ఫలితాల విషయం కూడా రేవంత్ రెడ్డి అనేక ప్రతికూలతలను అధిగమించాడు. తనను తాను మరోసారి నిరూపించుకున్నాడు. ఒకవేళ రేవంత్ రెడ్డి స్థానంలో కేసీఆర్ లేదా కేటీఆర్ గనక ఉండి ఉంటే ఫలితాలు ఏకపక్షంగా ఉండేవి. పైగా ఎన్నికల విషయంలో గులాబీ పార్టీ అడ్డగోలుగా వ్యవహరించేది. సరిగ్గా ఐదు సంవత్సరాల క్రితం జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో పై సీన్ రిపీట్ అయింది. కాకపోతే ఈసారి కాంగ్రెస్ పార్టీ స్వేచ్ఛాయుత విధానంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల అధికార పక్షానికి గౌరవం.. ప్రతిపక్షానికి తోడ్పాటు ప్రజల నుంచి లభించాయి. ఇదిగో ఇక్కడే రేవంత్ రెడ్డి గెలిచాడని.. అసలు సిసలైన నాయకుడిగా ఆవిర్భవించాడని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చూపించడానికి ప్రధాన కారణం రేవంత్ రెడ్డి దూకుడు. రేవంత్ రెడ్డి దాదాపుగా అన్ని జిల్లాలోని ప్రధాన కేంద్రాలలో బహిరంగ సభలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో గెలవాల్సిన అనివార్యతను వెల్లడించారు. తద్వారా తెలంగాణ ప్రజలు మరోసారి కాంగ్రెస్ పార్టీ వైపు దృష్టి సారించే విధంగా చేశారు.రేవంత్ రెడ్డి పాచిక వల్ల కాంగ్రెస్ పార్టీ భారీగా స్థానాలను సాధించినప్పటికీ.. ఒక మున్సిపాలిటీ విషయంలో మాత్రం రేవంత్ రెడ్డి స్థాయి సరిపోలేదు. ఆ మున్సిపాలిటీ పేరు సిరిసిల్ల. భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇక్కడ ఎలాగైనా కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని రేవంత్ రెడ్డి ప్రయత్నించారు. చివరి వరకు అన్ని రకాలుగా వ్యూహాలు అమలు చేశారు. ప్రణాళికలను పకడ్బందీగా రూపొందించారు.సిరిసిల్ల ఓటర్లు మాత్రం కాంగ్రెస్ పార్టీకి కాకుండా.. గులాబీ పార్టీకి జై కొట్టారు. ఇక్కడ 39 వార్డులకు 27 వార్డులను బిఆర్ఎస్ పార్టీ సొంతం చేసుకుంది. ఆరువార్డులలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది.

ఐదు వార్డులలో బిజెపి గెలుపును సాధించింది. ఒక వార్డులో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. తద్వారా రేవంత్ రెడ్డి పాచికలు కేటీఆర్ ముందు పారలేదు.

వాస్తవానికి ఇక్కడ కాంగ్రెస్ పార్టీ గెలవడానికి అనేక రకాలుగా ప్రయత్నం చేసింది. ఎన్నికలకు ముందే ఇక్కడ భారీగా అభివృద్ధి పనులు చేసింది. కాంగ్రెస్ పార్టీలోకి వలసలను కూడా ఆహ్వానించింది. అయినప్పటికీ ఎన్నికల ఫలితాలలో మాత్రం కాంగ్రెస్ పార్టీకి ఊహించని షాక్ తగిలింది.

# అధికార పార్టీకి గౌరవం.. ప్రతిపక్షాలకు సముచితం

హైదరాబాద్, మార్చి 14, సరిగ్గా తెలంగాణ రాష్ట్రంలో ఒక ఐదు సంవత్సరాల క్రితం మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. అప్పట్లో పెత్తనం మొత్తం కేటీఆర్ ది కాబట్టి.. అడ్డగోలుగా నిబంధనలు మొత్తం మార్చేశాడు. తన పార్టీ మాత్రమే గెలిచే విధంగా విధానాలు రూపొందించాడు. సీన్ కట్ చేస్తే సింహ భాగం మున్సిపాలిటీలలో గులాబీ పార్టీ గెలిచింది. ప్రతిపక్ష కాంగ్రెస్ గెలిచిన చోట కూడా బీఆర్ఎస్ ఆర్థిక బలంతో తొక్కి పారేసింది. క్యాంపు రాజకీయాలు స్టార్ట్ చేసింది.. కొంతమంది అభ్యర్థులను ఏకంగా అపహరించింది. ఇదే ప్రజాస్వామ్యం అంటూ కొత్త సూత్రీకరణకు దిగింది.ఇప్పుడు రేవంత్ పరిపాలన లోకి వద్దాం. ఇదేదో రేవంత్ గురించి భజన చేసే కార్యక్రమం కాదు. ఆయన పరిపాలనకు చిడతలు వాయించే వ్యవహారం అంతకంటే కాదు. బాధ్యత గల మీడియా సంస్థగా మా దృష్టికి వచ్చిన అంశాలను మా వీక్షకులకు అందించడం కోసమే ఈ కథనం పబ్లిష్ చేస్తున్నాం.తెలంగాణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చాలా తేడా ఉంటుంది. తెలంగాణలో సామాజికంగా.. రాజకీయంగా.. ఇతర వ్యవహారాలలో ప్రజలలో చైతన్యం విపరీతంగా ఉంటుంది. నచ్చిన వాళ్లను తెలంగాణ ప్రజలు నెత్తి మీద పెట్టుకుంటారు. అదే నచ్చని వాళ్ళని అయితే నేలకేసి కొడతారు. ఇందులో ఈ పార్టీ.. ఆ పార్టీ అని తేడా లేదు. అన్నిటికీ ఒకే విధమైన ట్రీట్మెంట్ ఇస్తారు తెలంగాణ ప్రజలు.సరిగ్గా ఐదు సంవత్సరాల క్రితం ఏకపక్షంగా మున్సిపల్ ఫలితాలను సాధించిన గులాబీ పార్టీ.. ఈసారి జరిగిన ఎన్నికల్లో గౌరవప్రదమైన స్థానాలను సాధించింది. కానీ ఇక్కడే కాంగ్రెస్ పార్టీ గులాబీ పార్టీకి అసలు సిసలైన ప్రజాస్వామ్య విలువలను బోధించింది. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికార దర్పాన్ని పెద్దగా వినియోగించలేదు. గులాబీ పార్టీ మాదిరిగా ఏకపక్షంగా వ్యవహరించలేదు. సాక్షాత్తు ముఖ్యమంత్రి స్వయంగా మీకు మంచి చేసే వాడిని ఎన్నుకోవాలని సూచించారు. మీకు కష్టాలు వస్తే ఆదుకునే వ్యక్తికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఆ సూత్రాన్నే తెలంగాణ ప్రజలు ఆచరించారు.అందువల్లే అధికార పార్టీకి గొప్పగా చెప్పుకునే స్థానాలు వచ్చాయి. ప్రతిపక్షాలకు గౌరవప్రదమైన స్థానాలు లభించాయి. ఎవరిని కూడా తక్కువ చూపు చూడలేదు తెలంగాణ ఓటర్లు. బిజెపికి బలం ఇచ్చారు. గులాబీ పార్టీకి పునర్జన్మ ఇచ్చారు. అధికార కాంగ్రెస్ పార్టీకి అండదండగా నిలిచారు. ఆమధ్య మహా రాష్ట్ర లో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ విజయం సాధించింది. దాదాపు క్లీన్ స్వీప్ చేసేసింది. ఈ విజయాన్ని అక్కడి అధికార పార్టీ గొప్పగా చెప్పుకుంది.ఇక కేరళ రాష్ట్రంలో కూడా జరిగిన స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి షాక్ తగిలింది. చాలావరకు స్థానాలలో అక్కడి ప్రతిపక్షం విజయం సాధించింది. కొన్ని ప్రాంతాలలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు సత్తా చూపించారు.ఈ రెండు ఉదాహరణలు చాలు స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా జరిగాయో చెప్పడానికి. ప్రజలు అయితేనేమో అధికార పక్షానికి లేకుంటేనేమో ప్రతిపక్షానికి ఓట్లు వేస్తున్నారు. తమ ఆగ్రహాన్ని ఏకపక్షమైన తీర్పుగా బ్యాలెట్ బాక్స్ లో వేస్తున్నారు.కానీ తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ప్రజలు ప్రజాస్వామ్యాన్ని మాత్రమే కోరుకుంటున్నారు. దీనికి ప్రభుత్వం కూడా తోడు కావడంతో పరిస్థితి చాలా వరకు ఆశాజనకంగా కనిపిస్తోంది. ఉదాహరణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఏకపక్షమైన ఫలితాలు రాలేదు. అలాగని భారత రాష్ట్ర సమితి దారుణంగా ఓడిపోలేదు. చివరికి భారతీయ జనతా పార్టీ కూడా ఇక్కడ సత్తా చూపించ గలిగింది. కేవలం ఉమ్మడి పాలమూరు జిల్లా మాత్రమే కాదు.. దాదాపు తెలంగాణ వ్యాప్తంగా కూడా పరిస్థితి ఇలానే ఉంది.ఏ జిల్లాలో కూడా ఏకపక్షమైన ఫలితాలు అధికార పార్టీకి రాలేదు. అలాగని ప్రతిపక్షానికి ప్రజలు గంప గుత్తగా జై కొట్టలేదు. అధికార పక్షాన్ని గౌరవించారు. ప్రతిపక్షాన్ని భుజం తట్టి నిలబెట్టారు. ఎక్కడ కూడా ఏకపక్షమైన ఫలితాన్ని ఓటర్లు అందించలేదు. అలాగని ప్రతిపక్షాలను చిన్నచూపు చూడలేదు?తెలంగాణ రాష్ట్రంలో సామాజిక చైతన్యం ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ప్రజలు ఎవరిని కూడా భుజాల మీదకి ఎత్తుకొని మోయలేరు. అలాగని కింద కూడా పడేయలేరు. సాధ్యమైనంత వరకు సముచితమైన స్థాయిలో తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. అనేక ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు దీనిని నిరూపించారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో కూడా బలంగా చాటారు. కేరళ రాష్ట్రంలో అత్యధికంగా అక్షరాస్యత ఉంటుంది. మహారాష్ట్రలో ప్రజలకు ఆర్థిక స్థిరత్వం ఎక్కువగా ఉంటుంది. కానీ ఈ రెండు రాష్ట్రాల ప్రజలను మించి తెలంగాణ ప్రజలు వ్యవహరించారు. తమకు తామే సాటి అని నిరూపించుకున్నారు.ఫలితంగా తెలంగాణ అంటేనే విభిన్న తత్వమని మరోసారి నిరూపించారు. 2023 ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి భారీగా మెజారిటీ ఇవ్వలేదు. అలాగని గులాబీ పార్టీని తక్కువ చూపు చూడలేదు. ప్రతిపక్షాన్ని గౌరవంగా ఉంచుకుంటూనే.. మార్పు కావాలని కాంగ్రెస్ పార్టీకి జై కొట్టారు. తెలంగాణ ప్రభుత్వం.. తెలంగాణ ప్రజలు వ్యవహరించిన తీరు వల్ల ప్రజాస్వామ్యం గొప్పగా వర్ధిల్లింది. "ఈసారి ఎన్నికలు బాగా జరిగాయి. చాలా స్థానాలలో హంగ్ ఏర్పడింది. ఈ ప్రకారం ఎన్నికల ప్రక్రియ ఎంత గొప్పగా జరిగిందో అర్థం చేసుకోవచ్చని" రాజకీయ విశ్లేషకులు అంటున్నారు..

# తెలంగాణలో మొదలైన అసలైన రాజకీయం

హైదరాబాద్, మార్చి 14, రాష్ట్రవ్యాప్తంగా వెలువడిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు అధికార, ప్రతిపక్ష పార్టీలకు వింత పరిస్థితిని తెచ్చిపెట్టాయి. మెజారిటీ చోట్ల కాంగ్రెస్ జెండా ఎగిరినప్పటికీ, సుమారు 12 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో 'హంగ్' ఏర్పడింది. ఇప్పుడు ఈ మున్సిపాలిటీల్లో పీఠాన్ని దక్కించుకోవాలంటే స్వతంత్ర అభ్యర్థుల మద్దతు అనివార్యంగా మారింది.సాధారణంగా గెలిచిన స్వతంత్రులను తమవైపు తిప్పుకోవడానికి పార్టీలు భారీ ఆఫర్లు ప్రకటిస్తుంటాయి. కానీ, ఈసారి సీన్ రివర్స్ అయ్యింది. "మద్దతు కావాలంటే మాకే ఛైర్మన్ పదవి ఇవ్వాలి" అంటూ స్వతంత్రులు డిమాండ్ చేస్తున్నారు. తమ పార్టీ గుర్తుపై గెలిచిన సీనియర్లను కాదని, బయటి వ్యక్తికి ఛైర్మన్ పదవి ఎలా ఇవ్వాలో తెలియక కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు తలలు పట్టుకుంటున్నారు.

### క్యాంపు రాజకీయాలు:

అభ్యర్థులు చేజారిపోకుండా ఉండేందుకు పార్టీలు ఇప్పటికే 'క్యాంపు' రాజకీయాలకు తెరలేపాయి. గెలిచిన వారిని రహస్య ప్రాంతాలకు తరలిస్తున్నారు.అలియాబాద్ (మేడ్చల్ జిల్లా): ఇక్కడ 20 వార్డుల్లో కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 7 స్థానాలు సాధించాయి. ఒక్క సీటు గెలిచిన ఇండిపెండెంట్ అభ్యర్థి గాదె వెంకటేష్ ఇప్పుడు నిర్ణయాత్మక శక్తిగా మారారు. ఛైర్మన్ పదవి ఇచ్చే పార్టీకే నా మద్దతు అని ఆయన తేల్చి చెప్పారు.జనగామ: ఇక్కడ కాంగ్రెస్, బీఆర్ఎస్ బలబలాలు సమానంగా ఉండటంతో, స్వతంత్ర అభ్యర్థి పాండు కోసం రెండు పార్టీల నేతలు బాహాబాహీకి దిగారు. తనను ఛైర్మన్ చేస్తామంటేనే వస్తానని ఆయన షరతు విధించడం విశేషం.ఒకవేళ భారీ ఆఫర్లు ఇచ్చి స్వతంత్రులకు ఛైర్మన్ పదవి కట్టబెట్టినా, వారు తర్వాత వేరే పార్టీలోకి జంప్ అయితే పరిస్థితి ఏంటన్నది పార్టీల ఆందోళన. ప్రస్తుతం ఈ 'హంగ్' మున్సిపాలిటీల్లో గెలిచిన అభ్యర్థులకు విపరీతమైన డిమాండ్ పెరగడంతో, రాజకీయ సమీకరణాలు గంటగంటకూ మారుతున్నాయి. మరో వైపు కేవలం గద్వాల మాత్రమే కాకుండా వర్ధన్నపేట, చౌటుప్పల్ మున్సిపాలిటీల్లోనూ ఇదే తరహాలో అక్రమాలకు పాల్పడ్డారని కేటీఆర్ ఆరోపించారు. గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, పోలీసులతో బెదిరించి బలవంతంగా తమ పార్టీలో చేర్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వ వేధింపులు ఉన్నప్పటికీ ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 16 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ స్పష్టమైన మెజారిటీతో నేరుగా పీఠాలను కైవసం చేసుకుంటోందని వెల్లడించారు.మరో 10 నుంచి 15 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ 'లార్జెస్ట్ పార్టీ' (అత్యధిక సీట్లు సాధించిన పార్టీ)గా అవతరించిందని తెలిపారు.భయంతోనే కాంగ్రెస్ అక్రమ మార్గాలను ఎంచుకుందని, తమ అభ్యర్థులను లాక్కునే ప్రయత్నాలను అడ్డుకుంటామని కేటీఆర్ హెచ్చరించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# ప్రధాన పార్టీలను మట్టికరిపించిన కవిత



మహబూబ్ నగర్, ఫిబ్రవరి 14, తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీ వేదికగా ఒక అరుదైన రాజకీయ సంచలనం నమోదైంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు షాక్ ఇస్తూ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ క్లీన్ స్వీప్ దిశగా దూసుకెళ్లి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకుంది. ఇక్కడ మొత్తం 10 వార్డులకు గాను ఏకంగా 8 స్థానాల్లో ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులు ఘనవిజయం సాధించగా, కాంగ్రెస్, బీఆర్ఎస్ చెరో ఒక స్థానానికి పరిమితమయ్యాయి.ఈ విజయం వెనుక ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యూహం స్పష్టంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వడ్డేపల్లిలో బలమైన నేతగా పేరున్న వడ్డేపల్లి శ్రీనన్న కొద్ది రోజుల క్రితమే కవిత సారథ్యంలోని 'తెలంగాణ జాగృతి'లో చేరారు. రాష్ట్రవ్యాప్తంగా జాగృతి నేతలు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన 'సింహం' గుర్తుపై పోటీ చేయాలని నిర్ణయించగా, వడ్డేపల్లిలో శ్రీనన్న మద్దతుదారులు అదే గుర్తుపై బరిలోకి దిగారు. తాజాగా వెలువడిన ఫలితాల్లో వారు సంచలన విజయం సాధించడంతో, ఈ గెలుపు కవిత రాజకీయ సత్తాకు నిదర్శనమని ఆమె మద్దతుదారులు సంబరాలు చేసుకుంటున్నారు.అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీలు వడ్డేపల్లిలో ఆశించిన ప్రభావం చూపలేకపోయాయి. కేవలం ఒక్కో సీటుతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. సామాన్య ప్రజల్లో శ్రీనన్నకు ఉన్న పట్టు, జాగృతి శ్రేణుల సమన్వయం ఈ విజయానికి బాటలు వేశాయని స్థానికులు పేర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో ఈ 'సింహం' గుర్తు మరిన్ని మలుపులకు కారణమయ్యేలా కనిపిస్తోంది.

హంగ్ దిశగా...

తెలంగాణలో 7 మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగాయి. ఇందులో కాంగ్రెస్ పార్టీ నాలుగ కార్పరేషన్లను కైవశం చేసుకుంది. బీజేపీ ఒకదాంట్లోపాగా వేసింది. మిగతా ఒక్కచోట మాత్రమే హంగ్ వచ్చే అవకాశం ఉంది. అందులో కూడా కాంగ్రెస్‌కు భాగం ఉండొచ్చని అంచనాలు ఉన్నాయి. దీంతో ఒక్క కార్పొరేషన్‌లో కూడా కారుకు చోటు లేదని స్పష్టమవుతోంది. కాంగ్రెస్ పార్టీ రామగుండం, మంచిర్యాల, నల్గొండ కార్పొరేషన్‌లలో స్పష్టమైన మెజార్టీతో విజయం సాధించింది. ఇంకా లెక్కింపు జరుగుతున్న మహబూబ్‌నగర్ కార్పొరేషన్లలో హస్తం పార్టీ ఆధిక్యంలో కొనసాగుతోంది. అక్కడ 60 డివిజన్‌లు ఉంటే వాటిలో 30కిపైగా డివిజన్‌లలో లెక్కింపు పూర్తి అయ్యింది. మిగతా స్థానాల్లో లెక్కింపు జరుగుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఆధిక్యంలో ఉంది. నల్గొండ కార్పొరేషన్‌లో 48 డివిజన్లు ఉంటే అందులో 27 చోట్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. మిగతా పార్టీలన్నీ సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. కారు పార్టీ అభ్యర్థులు 9 చోట్ల, బీజేపీ అభ్యర్థులు 4 చోట్ల, ఇతరులు 8చోట్ల గెలుపొందారు. రామగుండంలో ఉన్న 60 డివిజన్‌లలో 38 స్థానాల్లో కాంగ్రెస్ గెలుచుకుంటే... 13 మంది బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన అభ్యర్థులు గెలిచారు. బీజేపీ కేవలం ఒక్కటంటే ఒకటే గెలుచుకుంది. ఇతరులు 8 మంది విజయం సాధించారు. మంచిర్యాలలో 60 డివిజన్‌లకు 44 కాంగ్రెస్ కైవశం చేసుకుంది. బీఆర్ఎస్ 8, బీజేపీ 5 మాత్రమే గెలుచుకుంది. ఇతరులు ముగ్గురు గెలిచారు. కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లలో బీజేపీకి స్పష్టమైన మెజార్టీ వచ్చేసింది. అక్కడ ఆ పార్టీ పాలక మండలి కొలువుదీరనుంది. నిజామాబాద్ జిల్లాల్లో ఇంకా లెక్కింపు జరుగుతోంది. 60 డివిజన్‌లకు సగానికిపైగా డివిజన్‌లు కౌంటింగ్ పూర్తి అయ్యింది. ఇందులో ఎక్కువ స్థానాలు బీజేపీ దక్కించుకుంది. తర్వాత స్థానంలో స్వతంత్రులు, ఇతర పార్టీల నేతలు ఉన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ ఖాతా తెరవలేదు. కాంగ్రెస్ సింగిల్ డిజిట్‌కు పరిమితమైంది. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సొంత కార్పొరేషన్ అయిన కరీంనగర్‌లో కమలం వికసించింది. అక్కడ 66 డివిజన్‌లు ఉంటే అందులో 30కిపైగా డివిజన్‌లను బీజేపీ కైవశం చేసుకుంది. ఇంకా లెక్కింపు జరుగుతోంది. ఇక్కడ కాంగ్రెస్ రెండోస్థానంలో ఉంటే బీఆర్ఎస్ సింగిల్ డిజిట్‌కు పరిమితమైంది. కొత్తగూడెంలో హంగ్ వచ్చే ఛాన్స్ ఉంది. ఇక్కడ ఏ పార్టీ ఎక్కువ డివిజన్‌లు గెలుచుకోలేకపోయింది. 60 డివిజన్లు ఉన్న ఈ కార్పొరేషన్‌లో వివిధ పార్టీలు చెందిన వాళ్లు 29 గెలుచుకుంటే కాంగ్రెస్ ఇరవై రెండింటిలో ఆధిక్యం కనబరిచింది. ఇక్కడ వామపక్షాలు కీలకం కానున్నారు. వారితో పాలకమండలి కైవశం చేసుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తోంది. ఇక్కడ బీఆర్ఎస్ 8 డివిజన్లలోనే ఆధిక్యత చూపించింది. అయితే తమ మద్దతుతో పాలకమండలి ఛైర్మన్ కైవశం చేసుకోవాలని వామపక్షాలకు కేటీఆర్ ఆఫర్ ఇచ్చారు. దీంతో ఇక్కడ రాజకీయం ఎలా మారుతుందో అన్న ఉత్కంఠ నెలకొంది.

# కార్పొరేషన్లలలో కారుకు పంక్చర్

హైదరాబాద్, ఫిబ్రవరి 14, తెలంగాణ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ పార్టీకి గట్టి షాక్‌లా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఏడు కార్పొరేషన్ల ఎన్నికల్లో గులాబీ పార్టీ కనీసం ఉనికిని కూడా చాటుకోలేక, అన్ని చోట్లా మూడో స్థానానికి పరిమితమైంది. పట్టణ ఓటర్లు ఈసారి బీఆర్ఎస్ అగ్రనేతల కంచుకోటలను సైతం బద్దలు కొడుతూ అధికార కాంగ్రెస్ , బీజేపీల వైపు స్పష్టంగా మొగ్గు చూపారు. ఈ ఫలితాలు పార్టీ నాయకత్వానికి శరాఘాతంగా మారాయి.మున్సిపల్ కార్పొరేషన్లలో అత్యధికంగా నల్గొండ లో కాంగ్రెస్ తన విజయకేతనం ఎగురవేసింది. ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థులు కనీసం రెండో స్థానంలో కూడా నిలవలేకపోయారు. అటు రామగుండం కార్పొరేషన్‌లో కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యం సాధించగా, బీఆర్ఎస్ సింగిల్ డిజిట్ స్థానాలకే పరిమితమైంది. ప్రజలు అభివృద్ధి వైపు మొగ్గు చూపుతూ అధికార పార్టీకి భారీ మెజారిటీని కట్టబెట్టారు.కరీంనగర్ కార్పొరేషన్ లో కూడా బీఆర్ఎస్‌కు పరాభవం తప్పలేదు. కరీంనగర్, నిజామాబాద్‌లలో బీజేపీ మేయర్ పీఠాల దిశగా దూసుకుపోతుండగా, కాంగ్రెస్ గట్టి పోటీని ఇచ్చింది. కానీ, ఒకప్పుడు ఈ రెండు కార్పొరేషన్లను శాసించిన బీఆర్ఎస్ మాత్రం కేవలం నామమాత్రపు సీట్లకే పరిమితమైంది. ఇక్కడ బీజేపీ–కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోరు సాగింది. కొత్తగూడెం కార్పొరేషన్ లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో హంగ్ ఏర్పడింది. ఇక్కడ కాంగ్రెస్, సీపీఐ పార్టీలు సమాన స్థానాల్లో నిలిచాయి. అయితే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీపీఐకి అన్‌కండిషనల్ ఆఫర్ ఇచ్చింది. అయితే రాష్ట్ర స్థాయిలో పొత్తు ఉన్నందున సీపీఐ మాత్రం కాంగ్రెస్‌తో కలిసి పాలకవర్గాన్ని ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తోంది. మహబూబ్‌నగర్, మంచిర్యాల కార్పొరేషన్లలో కూడా కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది.అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, పలు కార్పొరేషన్ డివిజన్లలో స్వతంత్ర అభ్యర్థుల ఓట్ల కంటే బీఆర్ఎస్ అభ్యర్థులకు తక్కువ ఓట్లు వచ్చాయి. ఇది పార్టీ క్షేత్రస్థాయిలో ఎంతగా బలహీనపడిందో తెలియజేస్తోంది. కేవలం సిరిసిల్ల, సిద్దిపేట వంటి కొన్ని మున్సిపాలిటీలకు మాత్రమే బీఆర్ఎస్ పరిమితం కాగా, కార్పొరేషన్ల స్థాయిలో మాత్రం ఘోరంగా విఫలమైంది. ప్రస్తుత ట్రెండ్స్ ప్రకారం మొత్తం ఏడు కార్పొరేషన్లలో నల్గొండ, మహబూబ్‌నగర్, మంచిర్యాల, రామగుండం కాంగ్రెస్ వశం కాగా.. నిజామాబాద్, కరీంనగర్‌లలో బీజేపీ మేయర్లు కొలువుదీరే అవకాశం ఉంది. కొత్తగూడెంలో కాంగ్రెస్–సీపీఐ కూటమి అధికారంలోకి రానుంది. ఈ ఫలితాలు తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ ప్రభ తగ్గుతోందనడానికి సంకేతమని భావిస్తున్నారు.

# ఖమ్మం... గుమ్మంలో టీడీపీ లెక్క

ఖమ్మం, ఫిబ్రవరి 14, తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేయలేదు. స్థానికంగా బలం ఉన్నచోట సొంతంగానే ఆ పార్టీ నేతలు బరిలో దిగారు. అనూహ్యంగా ఖమ్మం జిల్లా మధిరలో టిడిపి అభ్యర్థి విజయం సాధించడం విశేషం. అయితే స్థానికంగా నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో అక్కడ టిడిపి అభ్యర్థికి ప్రజలు పట్టం కట్టారు. అది డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సొంత నియోజకవర్గం. అటువంటి చోట టిడిపి అభ్యర్థి గెలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. కానీ అక్కడ కాంగ్రెస్ మద్దతుతో టిడిపి గెలుపొందిందని కామెంట్స్ వినిపిస్తున్నాయి. వాస్తవానికి తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో టిడిపి అధికారికంగా పోటీ చేయలేదు. ఫలితాల ప్రకటనలో మాత్రం టిడిపి అభ్యర్థి విజయం సాధించారని తెలియడం తో ఉత్కంఠ నెలకొంది. ఖమ్మం జిల్లాలో టిడిపి హవా ఇంకా కొనసాగుతోందని స్పష్టమైంది. వాస్తవానికి తెలంగాణలో గ్రేటర్ హైదరాబాద్ తో పాటు ఖమ్మం జిల్లాలోనే టిడిపికి బలం ఉండేది. 2014లో జరిగిన ఎన్నికల్లో ఈ రెండు చోట్ల టిడిపి విజయం సాధించింది. అప్పట్లో మెజారిటీ స్థానాలు గ్రేటర్ హైదరాబాద్ తో పాటు ఖమ్మం జిల్లాలోనే వచ్చాయి..ఖమ్మం జిల్లాలో 2014 ఎన్నికల్లో సైతం మెజారిటీ సీట్లను కైవసం చేసుకుంది తెలుగుదేశం పార్టీ. కానీ 2018 ఎన్నికలకు వచ్చేసరికి మాత్రం సీన్ మారింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అసలు పోటీ చేయలేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు చంద్రబాబు ఎన్నో రకాల ప్రయత్నాలు చేశారు. కాసాని జ్ఞానేశ్వర్ కు నాయకత్వ బాధ్యతలు కట్టబెట్టారు. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల సమరానికి శంఖం పూరించేందుకు ఖమ్మం జిల్లాను ఎంచుకున్నారు. ఆ జిల్లాలో తెలుగుదేశం పార్టీ భారీ సమావేశం కూడా నిర్వహించింది. అయితే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఏపీలో చంద్రబాబు అరెస్టయ్యారు. ఆ సమయంలో ఎన్నికలకు వెళ్లడం అంటే సాహసంతో కూడిన పని. అందుకే చంద్రబాబు ఆ ఎన్నికలను బహిష్కరించారు.2024 లో ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో తెలంగాణలో సైతం తెలుగుదేశం పార్టీ యాక్టివ్ అవుతుందని అంతా భావించారు. కానీ ఎందుకో చంద్రబాబు పెద్దగా ఆసక్తి చూపలేదు. టిడిపి తెలంగాణ అధ్యక్ష పదవి కూడా భర్తీ చేయలేదు. అయితే దీని వెనుక వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడ తెలంగాణ సెంటిమెంట్ పోయి.. కాంగ్రెస్ పార్టీతో పాటు బిజెపి పుంజుకోవాలని.. గులాబీ పార్టీ బలహీన పడిన తర్వాతే టిడిపిని యాక్టివ్ చేస్తారని ఒక విశ్లేషణ ఉంది. అయితే మున్సిపల్ ఎన్నికల్లో కనీసం అధికారికంగా పోటీ చేయలేదు టిడిపి. కానీ ఖమ్మం జిల్లా మధిరలో మాత్రం ఒక వార్డు స్థానాన్ని కైవసం చేసుకుంది. ఖమ్మం జిల్లాలో టిడిపి సంస్థగతంగా బలంగా ఉండడానికి కారణం అక్కడ కమ్మ సామాజిక వర్గ ప్రాబల్యం అధికం. మొన్నటి ఎన్నికల్లో కమ్మ సామాజిక వర్గం కాంగ్రెస్ పార్టీకి మద్దతు దారుగా నిలిచింది. మొన్నటి పంచాయతీ ఎన్నికల్లో సైతం ఓ 15 సీట్లలో టిడిపి విజయం సాధించింది. ఇప్పుడు అధికారికంగా పోటీలో లేకుండానే మధిరలో టిడిపి అభ్యర్థి గెలవడం విశేషం.

# తీర్థయాత్రకు వెళ్లి వచ్చేసరికి?
# రిటైర్డ్ లైన్‌మెన్ ఇంట్లో చోరీ.



మధురవాడ తీర్థయాత్రలకు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఓ రిటైర్డ్ లైన్‌మెన్ ఇంట్లో చోరీ జరిగిన ఘటన పీ.ఎం.పాలెం క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం?మధురవాడ శివశక్తినగర్ రోడ్డు వివేకానంద కాలనీలో నివసిస్తున్న విశ్రాంత లైన్‌మెన్ బొడ్డేటి అప్పలరాజు (62) ఈనెల 2వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లారు. శనివారం (14వ తేదీ) ఉదయం యాత్ర ముగించుకుని ఇంటికి చేరుకోగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటం గమనించి షాక్‌కు గురయ్యారు. ఇంటి లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువాలో భద్రపరిచిన సుమారు 21 తులాల బంగారం మరియు రూ.6 లక్షల నగదు దొంగలు అపహరించినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

సమాచారం అందుకున్న పీ.ఎం.పాలెం క్రైమ్ సీఐ బి.ఎస్.ఎస్. ప్రకాష్ పర్యవేక్షణలో ఎస్.ఐ. సూర్యప్రకాష్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్ సహాయంతో వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు,

# ఎక్స్ అఫిషియో పైనే అందరి గురి

హైదరాబాద్, ఫిబ్రవరి 14, మున్సిపల్ ఎన్నికలు ముగిశాయి. ఇక పురపాలికల్లో ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు.. నగరపాలికల్లో మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు ఎక్స్ అఫీషియో సభ్యులు, వాళ్ల ఓట్లు బాగా వార్తల్లోకి ఎక్కాయి. ఈ క్రమంలోనే అసలు ఈ ఎక్స్ అఫీషియో సభ్యులు అంటే ఎవరు. వాళ్ల ఓట్లు మున్సిపల్ ఎన్నికల్లో ఎందుకు అంత కీలకం. వాళ్లు వేసే ఓట్ల వల్ల ఎవరికి ఉపయోగం అనే పూర్తి విషయాలను ఈ స్టోరీలో తెలుసుకుందాం.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెల్లడి అయ్యాయి. అత్యధిక వార్డుల్లో గెలిచిన అధికార హస్తం పార్టీ.. ఎక్కువ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను హస్త గతం చేసుకుంది. ఎన్నికల ఫలితాలు వెలువడటంతో.. ఇప్పుడు మున్సిపాలిటీల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను ఎన్నుకునేందుకు ఎన్నికలు జరగనున్నాయి. అదే సమయంలో కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆ మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లో అత్యధిక సీట్లు పొందిన పార్టీ.. ఛైర్మన్, వైస్ ఛైర్మన్.. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను దక్కించుకోనుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు చాలా మున్సిపాలిటీలు, కొన్ని కార్పొరేషన్లలో ఏ పార్టీకి పూర్తి మెజార్టీ రాకపోవడంతో హంగ్ ఏర్పడింది.ఈ హంగ్ మున్సిపాలిటీ, హంగ్ కార్పొరేషన్‌లలో ఎక్స్ అఫీషియో ఓట్లు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఛైర్మన్, వైస్ ఛైర్మన్.. మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల సమయంలో ఈ ఎక్స్ అఫీషియో ఓట్లు నిర్ణయాత్మకంగా ఉంటాయి. రెండు పార్టీలకు సమానంగా వార్డులు వస్తే.. అప్పుడు ఎక్స్ అఫీషియో సభ్యులు ఎవరికి ఓటు వేస్తారో ఆ కుర్చీ వారికే దక్కుతుంది.ఎక్స్ అఫీషియో అనేది లాటిన్ భాష నుంచి వచ్చిన పదం. దీనికి 'పదవీ హోదా కారణంగా' అని అర్థం. అంటే ఒక వ్యక్తికి ప్రస్తుతం ఉన్న పదవి కారణంగా మరో సంస్థలో సభ్యుడిగా గుర్తింపు ఉండటం. పురపాలికలు, నగరపాలికల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు వంటి ప్రజాప్రతినిధులు వారి హోదా కారణంగా ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు. అయితే వారు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి గెలవకపోయినా.. వారికి ఉన్న పదవి కారణంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల సమావేశాల్లో పాల్గొనే హక్కును కలిగి ఉంటారు. అదే సమయంలో మేయర్, ఛైర్మన్ ఎన్నికల్లో కొన్నిసార్లు ఓటు వేసే అవకాశం కూడా ఉంటుంది.ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో ఏదో ఒకచోట మాత్రమే ఓటు వేసే అవకాశం ఉంటుంది. అదే ఎమ్మెల్సీలు, రాజ్యసభ ఎంపీలు అయితే మాత్రం రాష్ట్రంలోని ఏ మున్సిపాలిటీలో అయినా ఒకదాన్ని సెలెక్ట్ చేసుకుని అక్కడ ఓటు వేయాల్సి ఉంటుంది. అయితే ఈ ఎక్స్ అఫీషియో ఓటు వేయాలంటే దానికి ఒక విధానం ఉంటుంది. మున్సిపాలిటీల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలకు ముందు (ఈ మున్సిపల్ ఎన్నికలకు ఈనెల 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు) ఆయా మున్సిపల్ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.మున్సిపల్ కమిషనర్‌కు అప్లై చేసుకున్న తర్వాత మాత్రమే ఆ ఎమ్మెల్యే, లోక్‌సభ ఎంపీ, ఎమ్మెల్సీ, రాజ్యసభ ఎంపీకి ఓటు హక్కు అమల్లోకి వస్తుంది. అయితే ఆ సమయంలోగా దరఖాస్తు చేసుకోకపోతే వారు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నప్పటికీ.. ఓటు హక్కు మాత్రం వినియోగించుకోలేరు. మున్సిపల్ ఎన్నికల్లో ఎన్నికైన వార్డు సభ్యులు.. ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకునే సమయంలో రెండు పార్టీలకు సమానంగా ఓట్లు వస్తే.. అప్పుడు ఎక్స్ అఫీషియో సభ్యుల ఓటు కీలకంగా మారుతుందిఒక మున్సిపాలిటీలో మొత్తం 30 వార్డులు ఉంటే.. అందులో రెండు పార్టీలకు చెరో 15 సీట్లు వస్తే.. ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకునే సమయంలో టై అవుతుంది. అలాంటి సమయంలోనే ఈ ఎక్స్ అఫీషియో సభ్యుడు ఎవరి వైపు ఓటు వేస్తే ఆ పార్టీ బలం 16కు పెరుగుతుంది. దీంతో మున్సిపల్ ఛైర్మన్ పదవి ఆ పార్టీకే దక్కుతుంది. అందుకే రెండు పార్టీలకు మున్సిపాలిటీలో సమానంగా బలం ఉన్నపుడు ఈ ఎక్స్ అఫీషియో సభ్యుడు కింగ్ మేకర్ అవుతారు. అందుకే పురపాలికల్లో ఎక్స్ అఫీషియో ఓటు చాలా కీలక పాత్రను పోషిస్తుంది.

## బీఆర్ఎస్ తో సిపిఐ దోస్తీ
## కొత్తగూడెం మేయర్ పదవి కోసం ఇరు పార్టీలు సిద్ధం

కొత్తగూడెం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతిపాదన మేరకు కొత్తగూడెం మేయర్ పదవి కైవసం చేసుకుంటామని సిపిఐ నేత, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ 22, సీపీఐ 22, బీఆర్ఎస్ 8, ఇతరులు 6, బీజేపీ 1, సీపీఎం 1 సీట్లు రావడంతో హంగ్ ఏర్పడగా, సీపీఐ ఒప్పుకుంటే తమ మద్దతుతో మేయర్ పదవి ఇస్తామని కేటీఆర్ ప్రకటించారు. కేటీఆర్ ఫోన్ చేసి మాట్లాడారని, ఆయన ప్రతిపాదన మేరకు బీఆర్ఎస్ పార్టీతో కలిసి మేయర్ పదవి దక్కించుకుంటామని సీపీఐ నాయకుడు కూనంనేని సాంబశివరావు ప్రకటించారు.

# ఘనంగా కేబీఆర్ పార్క్‌లో ఇండియన్ డాగ్ అడాప్షన్ కార్యక్రమం

**అహింసా సందేశంతో స్ట్రే డాగ్ అడాప్షన్**
**కుక్కపిల్లను దత్తత తీసుకున్న మంత్రి సీతక్క**
**అహింసే కాంగ్రెస్ మూల సిద్ధాంతం**
**- మంత్రి సీతక్కకుక్కలను చంపిన సర్పంచ్ లపై కఠిన చర్యలు**
**- మంత్రి సీతక్క**

జూబ్లీహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ లో డాగ్ అడాప్షన్ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క హజరయ్యారు. కొండా సురేఖ చేతుల మీదుగా స్వదేశి కుక్కపిల్లను మంత్రి సీతక్క అడాప్ట్ చేసుకుని ఆదర్శనంగా నిలిచారు. ఎంపీ రేణుక చౌదరి మంత్రి సీతక్క చేతుల మీదుగా కుక్క పిల్లను ఆడాప్ట్ చేసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ నగర నడిబొడ్డున జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఇలాంటి మంచి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. స్ట్రే డాగ్స్‌ను దత్తత తీసుకోవడం ద్వారా వాటికి జీవించే హక్కును కల్పించడమే కాకుండా సమాజంలో మానవత్వాన్ని పెంపొందించవచ్చని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అహింసా సిద్ధాంతాన్నే అనుసరించిందని ఆమె స్పష్టం చేశారు. అహింసా మార్గంలోనే దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ అని గుర్తుచేశారు. ప్రతి ప్రాణికీ జీవించే హక్కు ఉందని, విశ్వాసానికి మారుపేరు కుక్క అని ఆమె అన్నారు. ఇంట్లో ఒక డాగ్ ఉంటే భద్రతా భావం కలుగుతుందని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిదని తెలిపారు.తెలంగాణలో కొన్ని ప్రాంతాల్లో కొందరు సర్పంచ్‌లు కుక్కలను చంపిన ఘటనలను ప్రస్తావిస్తూ, ఆ సంఘటనలను ప్రభుత్వం ఖండించిందని, సంబంధిత వారిపై చర్యలు కూడా తీసుకున్నామని మంత్రి సీతక్క తెలిపారు. అలాంటి తప్పులను ప్రభుత్వానికి అంటగట్టడం భావ్యం కాదని, పార్లమెంట్‌లో లేదా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరైంది కాదని ఆమె పేర్కొన్నారు. ఎవ్వరూ కూడా కుక్కలను చంపకూడదని, నియంత్రణ చర్యలు పాటిస్తూ మానవత్వంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు.గ్రామాల్లో ప్రతి ఇంటికీ ఒక కుక్క ఉండేదని, పది మందితో సమానంగా ఒక కుక్క కాపలా కాస్తుందని ఆమె గుర్తుచేశారు. మన దేశంలో ఎన్నో స్వదేశీ డాగ్ బ్రీడ్స్ ఉన్నాయని, అందరూ ఇండియన్ డాగ్స్‌ను అడాప్ట్ చేసుకోవాలని కోరారు.మనుషుల మధ్య అప్పుడప్పుడూ మానవత్వం లోపిస్తోందని, రక్త సంబంధాలు కూడా మరచి ఒకరిపై ఒకరు దాడులు చేసుకునే పరిస్థితులు వస్తున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇంటి కుక్క మాత్రం ఎప్పుడూ తన యజమానిని హాని చేయదని, విశ్వాసంతో కాపాడుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీ రేణుకా చౌదరి, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, మాజీ కార్పొరేటర్ విజయా రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# నా మద్దతు బీఆర్ఎస్ కే..
# వికారాబాద్ లో స్వతంత్ర అభ్యర్థి
# పోలీసుల అత్యుత్సాహం

వికారాబాద్ జిల్లాలో పోలీసులు అత్యుత్సాహం బయటపడింది. బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలిపిన స్వతంత్ర అభ్యర్థిని తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేసారు. తన ఇష్టంతోనే బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇస్తున్నానని అభ్యర్థి, చెప్పడంతో పోలీసులు నిరాశతో వెనుదిరిగారు. వికారాబాద్ జిల్లాలో తాను బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇస్తానని ఒకటవ వార్డులో గెలుపొందిన స్వతంత్ర అభ్యర్థి అక్కమ్మ మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఇంటికి చేరుకుంది. అయితే అక్కమ్మ కొడుకు బాలు తన తల్లిని బీఆర్ఎస్ నాయకులు కిడ్నాప్ చేశారని ఫిర్యాదు చేసాడు. బాలు ఫిర్యాదు మేరకు కొప్పుల మహేష్ రెడ్డి ఇంటికి చేరుకుని, అక్కమ్మను తీసుకెళ్లేందుకు పోలీసుల విఫల ప్రయత్నం చేసారు. తాను తన ఇష్టంతోనే బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నానని అక్కమ్మ స్టేట్మెంట్ ఇవ్వడంతో పోలీసులు వెనుతిరిగారు. కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో మరోసారి అక్కమ్మను తీసుకెళ్లేందుకు వచ్చిన పోలీసులను బీఆర్ఎస్ కార్యకర్తలు తిప్పి పంపారు.

# కారుకు ఆశించిన ఫలితాలు రాలేదేందుకు?

## ఓవర్ కాన్ఫిడెన్స్?.
## అధికార పార్టీని తక్కువ అంచనా వేయడం
## పార్టీ ఎమ్మెల్యేలున్న దగ్గర కుడా నిరాశే

హైదరాబాద్ రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ పార్టీకీ ఆశించిన ఫలితాలు రాలేదు.అయితే వార్డులు సాధించి తన పట్టును నిలుపుకుంది. నిజానికి మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటుతుందని అంతా భావించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, పార్లమెంటు ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత గులాబీ పార్టీ కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోను ఓడిపోయింది.ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పర్వాలేదనిపించింది. మున్సి పల్ ఎన్నికలు పార్టీ గుర్తుపై జరిగిన ఎన్నిక లు కావడంతో బీఆర్ఎస్ అధిష్టానం మెజార్టీ స్థానా లను గెలుచుకోవాలని భావించింది. అయితే మున్సి పల్ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ నేతలు, క్యాడర్ నునిరాశకుగురిచేశాయనేచర్చ జరుగుతోంది.మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ రావడం కంటే ముందే బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహించింది. కేటీఆర్, హరీష్ రావు ఉమ్మడి జిల్లాల వారీగా పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమై ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. మున్సిపాలిటీలతో పాటు కార్పోరేషన్లకు మాజీ మంత్రులు, కార్పోరేషన్ మాజీ చైర్మన్లకు,సీనియర్ నేతలకు భాధ్యతలు ఇచ్చారు.దీంతో గులాబీ పార్టీ 30 నుంచి 35 మున్సిపాలిటీలు వస్తాయని ఆశించింది. తీరా ఎన్నికల ఫలితాల్లో 16 మున్సిపాలిటీలకు మాత్రమే పరిమితం అయింది.ఇక ఎవరికి మెజారిటీ రాకుండా హంగ్ ఫలితాలు వచ్చిన చోట మూడు లేదా నాలుగు బిఆర్ఎస్ పార్టీకి వస్తే ఫిగర్ 20 రీచ్ అయ్యే ఛాన్స్ ఉంది. ఇక గెలుస్తుందని అనుకున్న చోట హంగ్ ఫలితాలు వచ్చాయి. హంగ్ వచ్చిన మున్సిపాలిటీల్లో గెలిచిన వారిని కాపాడుకోవడం కోసం క్యాంపు రాజకీయాలు బిఆర్ఎస్ షురూ చేసింది.

ఇక రాష్ట్రంలో ఏడు మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగాయి.ఒక్కటి బిఆర్ఎస్ ఖాతాలో పడలేదు. రెండు చోట్ల బీజేపీ గెలుపొందింది.నాలుగు స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది.కొత్తగూడెం కార్పోరేషన్ లో హంగ్ ఫలితాలు వచ్చాయి. మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు వీరిద్దరూ ప్రచారం చేసిన మున్సిపాలిటీల్లో కొంత సానుకూల ఫలితాలు వచ్చాయి. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో నిరాశ తప్పలేదు. మరోవైపు ఫలితాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా బిఆర్ఎస్ కు మంచి ఫలితాలు వచ్చాయి. గజ్వేల్, పటాన్ చెరు,దుబ్బాక నియోజకవర్గాల్లో గులాబీ పార్టీ హవా కొనసాగింది. ఇక సిరిసిల్లలో కేటీఆర్ తన పట్టును మరోసారి నిలుపుకున్నారు. ఇక నిజామాబాద్ జిల్లాల్లో మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి నియోజకవర్గంలో బిఆర్ఎస్ ఓడిపోయింది. కరీంనగర్ లో మాజీ మంత్రి గంగుల కమలాకర్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఓటమి తప్పలేదు. సూర్యాపేటలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డికి పట్టణ ఓటర్లు షాక్ ఇచ్చారు. హుజురాబాద్ లో పాడి కౌశిక్ రెడ్డి సిట్టింగ్ ఎమ్మెల్యే అయినా మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ పార్టీ ఓడింది. కోరుట్లలోను సేమ్ సీన్. సిట్టింగ్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ శ్రమించినప్పటికీ ఫలితం దక్కలేదు. ఏమైయినా ఫలితాలు మాత్రం షాకింగ్ కు గురి చేశాయి. దీంతో పాటు ఓవర్ కాన్ఫిడెన్స్ గులాబీ పార్టీని దెబ్బతీసిందనే చర్చ బిఆర్ఎస్ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీని తక్కువ అంచనా వేయడంతోనే ఫలితాలు రివర్స్ అయినట్లుగా తెలుస్తోంది.

# బడ్జెట్ పత్రాలతో బయలుదేరిన మంత్రి పయ్యావుల





అమరావతి ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్కు బడ్జెట్ ప్రతులు ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు అందచేసారు. కేశవ్ క్యాంపు కార్యాలయంలో బడ్జెట్ ప్రతులు అందజేసారు. బడ్జెట్ పత్రాలను ఆర్థికమంత్రి దేవుడి ముందు పెట్టి పూజలు నిర్వహించారు. తరువాత మంత్రి బడ్జెట్ ప్రతులతో అసెంబ్లీకి బయల్దేరారు. వెంకటపాలెంలోని టీటీడీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పయ్యావుల కేశవ్ పూజలు నిర్వహించారు

# కోటప్పకొండ ఘాటు రోడ్డులో ట్రాఫిక్ జామ్

పల్నాడు కోటప్పకొండ ఘాటు రోడ్డులో సుమారు 40 నిమిషాలు ట్రాఫిక్ లో కలెక్టర్ వాహనం నిలిచిపోయింది. మహాశివరాత్రికి ఒక రోజు ముందే కోటప్పకొండకు భక్తులు పోటెత్తారు. దాంతో ఘాటు రోడ్డులో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం కలిగింది. వాహనాలు గంటలు తరబడి నిలిచిపోయాయి. ఏర్పాట్లను పరిశీలించేందుకు కలెక్టర్ కృతిక శుక్లా కోటప్పకొండకు చేరుకున్నారు.

## ఎర్రచందనం ముద్దాయిలు ఇద్దరిపై పీడీ యాక్ట్

### ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న టాస్క్ ఫోర్స్


సయ్యద్ ఫైరోజ్ @ ఫైరోజ్ @ సయ్యద్ @ ఫైరు


రాజశేఖర్ @ రాజబాబు @ బూసి రాజశేఖర్

తిరుపతి ఎర్రచందనం అక్రమ రవాణాకు చెందిన పలు కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న కర్నాటక కు చెందిన సయ్యద్ ఫైరోజ్ ఎలియాస్ ఫైరోజ్ ఎలియాస్ సయ్యద్ ఎలియాస్ ఫైరు (38), చిత్తూరు జిల్లాకు చెందిన రాజశేఖర్ ఎలియాస్ రాజా బాబు ఎలియాస్ బూసి (33)లపై టాస్క్ ఫోర్స్ అధికారులు పీడీ యాక్ట్ అమలు చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించడమే కాకుండా, ఎక్కువ కేసుల్లో ఎర్రచందనం అక్రమ రవాణా వృత్తిగా చేసుకుని, ముఠాగా ఏర్పడి స్మగ్లింగ్ కు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్ట్ లు అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇద్దరు ముద్దాయిలు సయ్యద్ ఫరోజ్ ఎలియాస్ ఫైరోజ్ ఎలియాస్ ఫైరు, రాజశేఖర్ ఎలియాస్ రాజబాబు ఎలియాస్ బూసి లపై పీడీ యాక్ట్ అమలుకు టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు సిఫారసు చేశారు. ఈ మేరకు తిరుపతి జిల్లా కలెక్టరు, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, వీరిపై పీడీ యాక్ట్ అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిద్దరూ ఎర్రచందనం కొల్లగొట్టడుతూ, వన్య మృగాల చట్టాలను ఉల్లంఘించి నేరాలు చేస్తూ ప్రజాజీవనానికి అటంకం కలిగిస్తున్నట్లు గుర్తించారు. పీడీ యాక్ట్ అమలులో భాగంగా నిందితులను కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధకంలో భాగంగా పీడీ యాక్ట్ అమలు చేయడానికి వెనుకాడబోమని టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ హెచ్చరించారు. ఎర్రచందనం కేసుల్లో ఇప్పటికే అనేక మందికి శిక్షలు పడ్డాయని గుర్తు చేశారు. యువత ఎర్రచందనం అక్రమ రవాణాకు ప్రయత్నించి వారి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని చెప్పారు.

## ఏపీ బడ్జెట్‌లో ప్రధాన కేటాయింపులు

### సంక్షేమం, విద్య, వ్యవసాయానికి భారీ నిధులు

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌లో సంక్షేమం, విద్య, వ్యవసాయం, మౌలిక వసతులకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. వివిధ పథకాలు, శాఖలకు కేటాయించిన ముఖ్య నిధులు ఇలా ఉన్నాయి:?? సంక్షేమ పథకాలుతల్లికి వందనం ? రూ. 9,668 కోట్లుమహిళా, శిశు సంక్షేమం ? రూ. 4,581 కోట్లుస్కాలర్‌షిప్‌లు ? రూ. 3,836 కోట్లుడొక్క సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ? రూ. 2,161 కోట్లుఅన్నదాత సుఖీభవ ? రూ. 6,600 కోట్లుమత్స్యకారులకు సహాయం ? రూ. 260 కోట్లుధరల స్థిరీకరణ నిధి ? రూ. 500 కోట్లు?? విద్య ఽ యువతపాఠశాల విద్య ? రూ. 32,308 కోట్లుఉన్నత విద్య ? రూ. 2,566 కోట్లుమనబడి ? మన భవిష్యత్ ? రూ. 1,500 కోట్లుఖఓ ాఞఞ్రనీనీశ్రీబ టనీతీ ఖీతిబతినిణ ఎనిటతిజీ ? రూ. 707 కోట్లుసర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర ? రూ. 654 కోట్లుసమగ్ర శిక్షణ ? రూ. 2,946 కోట్లుస్కిల్ డెవలప్‌మెంట్ ? రూ. 1,232 కోట్లుయూత్ అండ్ స్పోర్ట్స్ ? రూ. 438 కోట్లు?? వ్యవసాయం ఽ సాగునీరుసాగునీటి ప్రాజెక్టులు ? రూ. 9,906 కోట్లురాష్ట్రీయ కృషి వికాస్ యోజన ? రూ. 1,927 కోట్లుపోలవరం ప్రాజెక్ట్ ? రూ. 6,105 కోట్లు?? మౌలిక వసతులు ఽ ఇతర శాఖలుఅమరావతి అభివృద్ధి ? రూ. 6,000 కోట్లువైద్య ఆరోగ్య శాఖ ? రూ. 19,306 కోట్లుబీసీ సంఘాలు ? రూ. 23,650 కోట్లుజల వనరుల శాఖ ? రూ. 18,223 కోట్లుపంచాయతీ రాజ్ ? రూ. 22,941 కోట్లుమున్సిపల్ శాఖ ? రూ. 14,538 కోట్లుఈ బడ్జెట్‌లో సంక్షేమంతో పాటు విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, మౌలిక వసతుల అభివృద్ధికి సమతుల్య ప్రాధాన్యత ఇచ్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## మృతదేహాన్ని ముట్టుకోం



### వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో దారుణం

వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో దారుణం జరిగింది. ఖమ్మంకు చెందిన కాంతారావుకు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు ఎంజీఎంకు తీసుకువచ్చారు. అయితే నిన్న సాయంత్రం మృతి చెందగా మృతదేహాన్ని బయటకు తీసుకురావడానికి సిబ్బంది నిరాకరించారు. కనీసం స్ట్రెచర్ కూడా ఇవ్వకపోవడంతో.. చేసేది ఏమీ లేక మృతదేహాన్ని చేతుల మీదుగా తీసుకెళ్లి అంబులెన్స్లో ఎక్కించారు న కుటుంబసభ్యులు.

## పిఆర్సీ సాధనకై పోరు తీవ్రతరం

**-ఈనెల 17న ఛలో విజయవాడ జయప్రదం చేయండి.**

**-రణభేరిలో యుటిఎఫ్ నేతలు బి.లక్ష్మీరాజా, మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు**



బద్వేలు 12వ పిఆర్సీ అమలు, పెండింగ్ డిఏ ల విడుదల, ఆర్థిక బకాయిల సాధన కోసం పోరు తీవ్రతరం చేస్తామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు హెచ్చరించారు. రణభేరి 2.0 కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 17వ తేదీ యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జీపు జాత కడప జయనగర్ కాలనీలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చేరుకుంది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 18 మాసాలు పూర్తవుతున్నా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ఎన్నికలకు ముందు కూటమి పెద్దలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదన్నారు. 12వ పిఆర్సీ గడువు ముగిసి మూడేళ్లవుతున్నా , పిఆర్సీ అమలుకు ప్రయత్నించకపోవడం ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరిని తేటతెల్లం చేస్తున్నదన్నారు. వైసీపీ హయాంలో నియమించిన పిఆర్సీ చైర్మన్ డాక్టర్.మన్మోహన్ సింగ్ తన బాధ్యతలకు రాజీనామా చేసినప్పటికీ నూతన చైర్మన్ ను నియమించకపోవడం తగదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలను అమలు చేయడంతో పాటు, ఆర్థిక బకాయిలన్నిటినీ ఆరు మాసాలలోగా చెల్లిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆ వైపుగా కనీసం ఆలోచించకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఉద్యోగులకు ఎనిమిది వేల కోట్ల రూపాయల బకాయిలను మాత్రమే చెల్లించి, ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్న కూటమి ప్రభుత్వం ఇంకా 35 వేల కోట్ల రూపాయల బకాయిల్ని చెల్లించే విషయాన్ని విస్మరించిందన్నారు. ఆర్థిక బకాయిల చెల్లింపులపై రోడ్డు మ్యాప్ ప్రకటించి నిర్ణీత గడువులోగా అన్ని రకాల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. డి.ఏ లను ఎప్పటికప్పుడు చెల్లిస్తామని ఇచ్చిన హామీ మేరకు నాలుగు డిఏలు చెల్లించాల్సి ఉండగా, ఒక్క డిఏ మాత్రమే చెల్లించి చేతులు దులుపుకోవడం తగదన్నారు. ఒక్క డిఏ చెల్లింపు కోసం సైతం ముఖ్యమంత్రి స్థాయిలో సంఘాలు చర్చించాల్సి రావడం దారుణమన్నారు. సరెండర్ లీవ్ బకాయిలను నాలుగేళ్లుగా చెల్లించడం లేదన్నారు. జీతం మాత్రం ఒకటవ తేదీ చెల్లిస్తే చాలన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే విషయంలో ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని ఆర్భాటంగా ప్రకటించుకుంటున్న పాలకులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో మాత్రం ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని బీద అరుపులు అరుస్తున్నారని విమర్శించారు. తక్షణం నూతన పిఆర్సీ ని ఏర్పాటుచేసి, పిఆర్సీ అమలయ్యె వరకు 29 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 17వ తేదీ చేపట్టబోయే ఛలో విజయవాడ కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు రాజశేఖర్ రాహుల్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఎజాస్ అహమ్మద్, డి.సుబ్బారావు, ఎ.డి.దేవ దత్తం, కె.సుధాకర్, పి.వెంకటసుబ్బయ్య, కడప నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హిఫాజితుల్లా, కరీముల్లా, ట్రెజరర్ మేరీ ప్రసన్న, కడప మండల ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ వర్సెస్ రాజగోపాల్

హైదరాబాద్ తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు మునుగోడు ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం లేపుతున్నాయి. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.మంత్రి పదవి కోసం రెండేళ్లుగా సర్వ శక్తులు ఒడ్డుతున్న వార్తల్లోకెక్కడం కొత్తేమి కాదు. సమయం దొరికినప్పుడల్లా మంత్రి పదవి ఇవ్వాలంటూ సీఎం ను,అధిష్టానాన్ని టార్గెట్ చేసే ఆ ఎమ్మెల్యే ఇప్పుడు నేరుగా సీఎం కుర్చీ పై కన్నేశారు.ఓ మెట్టు పైకెక్కి 'పులివెందులలో రాజశేఖర్ రెడ్డి ఎట్లనో మునుగోడులో రాజగోపాల్ రెడ్డి అట్లా?!! అంటూ తన నియోజకవర్గంలో స్పీచ్ లుమొదలు పెట్టారు.ఇది కేవలం ఉపమానం కాదు. మంత్రి పదవి ఇవ్వడం మాట ఇచ్చారు, మాట నిలబెట్టాలి, కపోతే నా టార్గెట్ మారదు. డైరెక్ట్ సీఎం చైర్ వైపే అంటూ అల్టిమేటం జారీ చేశారు.

ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ఎవరిని ఉద్దేశించి చేశారు!.నేరుగా సీఎం రేవంత్ రెడ్డి కుర్చీ కే ఎసరు పెట్టారా అన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో ఓపెన్గానే నడుస్తోంది.ఒకవైపు రేవంత్ రెడ్డి అధికార సమతుల్యతలు కేబినెట్ బ్యాలెన్స్, సామాజిక సమీకరణలు, మరోవైపు రాజగోపాల్ రెడ్డి వ్యక్తిగత బలం, నియోజకవర్గంపై సంపూర్ణ పట్టు ఇతర అంశాల సంకేతాలు రాజగోపాల్ రెడ్డి మాటల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

మొత్తానికి, మునుగోడు నుంచి వచ్చిన ఈ గర్జన కాంగ్రెస్లో నిశ్శబ్దాన్ని చెదరగొట్టింది.ఇది లేక రేవంత్ లబ రాజగోపాల్ రెడ్డి పవర్ పాలిటిక్స్ తో కొత్త అధ్యాయం మొదలవుతుందా?రాబోయే రోజుల్లో ఈ 'చేతి పట్టు'తుఫాన్ గా మారుతుందా?..మంత్రి పదవి తో ఆగుతుందా వేచి చూడాలి.

## సేవాలాల్ మహారాజ్ జయంతి

### పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

హైదరాబాద్ బంజారా ల ఆరాధ్య దైవం శ్రీ సేవాలాల్ మహారాజ్ అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా రాఖీ నగర్ లోని బాపూనగర్ కమిటీ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా సేవాలాల్ మహారాజ్ చిత్రపటం వద్ద పూలు ఉంచి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ బోధించిన సత్యం, ధర్మం, అహింసా మార్గంలను అనుసరించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళులు అన్నారు. బంజారాల ఐక్యత కోసం ఎంతో కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని గుర్తు చేశారు.

## బెల్లంపల్లిలో బీఆర్ఎస్కు మరింత బలం..

### పార్టీలో చేరిన పలువురు కౌన్సిలర్లు!



బెల్లంపల్లి మున్సిపాలిటీలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. బెల్లంపల్లికి చెందిన పలువురు కౌన్సిలర్లు శనివారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో గులాబీ గూటికి చేరారు. పార్టీలో చేరిన వారికి కేటీఆర్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. 30వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ శంకర్ సింగ్ తో పాటు, కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన 26వ వార్డు కౌన్సిలర్ కుమారస్వామి అధికారికంగా బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్నారు.

వీరితో పాటు బీజేపీకి చెందిన 34వ వార్డు అభ్యర్థి రామూర్తి కూడా కేటీఆర్ను కలిశారు. ఆయన ప్రస్తుతానికి పార్టీలో అధికారికంగా చేరనప్పటికీ, బీఆర్ఎస్ విధానాలకు ఆకర్షితులై పార్టీకి పూర్తి స్థాయి మద్దతును ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ చేరికల వల్ల బెల్లంపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ మరింత బలోపేతం కానున్నది.

## వైభవంగా శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ

### వేంకటేశ్వరుస్వామి స్నపన తిరుమంజనం

తిరుపతి, 2026 ఫిబ్రవరి 14 శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలోని కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లకు శనివారం స్నపన తిరుమంజనం (పవిత్రస్నానం) శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రధాన కంకణభట్టర్ శ్రీ బాలాజి రంగాచార్యులు ఆధ్వర్యంలో ఈ విశేష ఉత్సవం నిర్వహించారు. ఇందులో ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవకలశాభిషేకం, రాజోపచారం నిర్వహించారు. అనంతరం ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం చేపట్టారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, పెరుగు,తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు. ఈ సందర్భంగా తైత్తరీయ ఉపనిషత్తు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, పంచశాంతి మంత్రములు, దివ్యప్రభందములోని అభిషేక సమయంలో అనుసంధానము చేసే పాశురాలను అర్చకులు పఠించారు. ఈ వేడుకలో ఒకో క్రతువులో ఒక మాల వంతున తామర పూలు, రోజా, తామర గింజలు, వివిధ రకాల సాంప్రదాయ పుష్పాలు, తులసీ తదితర ఏడు రకాల మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు.

## మానవతా నాగేశ్వరరావు అనుమానస్పద మృతి



ఏలూరు నగరంలో తన ఇంటి పేరుని తాను నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ పేరుగా మార్చుకున్న ఆలపాటి నాగేశ్వరరావు అలియాస్ మానవతా నాగేశ్వరరావు అనుమానాస్పద మృతి చెందారు. ఈ నెల 9వ తేదీన ఉదయం వసంతం మాల్ సెంటర్లో ఆయన నిర్వహిస్తున్న గాయత్రి ఫైనాన్స్ నుండి బయటికి వెళ్తున్న అని బయలుదేరిన ఆయన ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లారు. దీంతో కంగారు పడ్డ ఆయన భార్య టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు డిఎస్పి శ్రావణ్ కుమార్ ఆయన ఆచూకీ కోసం రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలలో ఆయన నూజివీడు వైపు వెళ్తున్నట్లు గుర్తించారు. ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో ఆయన ఆచూకీ కనిపెట్టడం మరింత కష్టమైంది అయితే ఈరోజు ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ గన్నవరం పోలీస్ స్టేషన్ లిమిట్స్ మధ్య ఉన్న చెరువులో ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు ప్రస్తుతం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించే పనిలో నిమగ్నంగా ఉన్నారు మీ మృతదేహం దొరికిన సమీపంలోనే ఆయన ప్రయాణించిన వాహనం లభించడంతో ఇది ఆయనేనని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కారెక్కిన ఇద్దరు ఇండిపెండెంట్లు



పటాన్ చెరు గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో ఇద్దరు ఇండిపెండెంట్ కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పటాన్ చెరు నియోజకవర్గంలోని 5 మున్సిపాలిటీలలో ఇప్పటికే గడ్డపోతారం, గుమ్మడిదల బీఆర్ఎస్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. జిన్నారం, ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపాలిటీలలో హంగ్ ఏర్పడింది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో ఇస్నాపూర్ మున్సిపాలిటీలలోని 10వ వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ ఎల్లకొండ రాహుల్ రెడ్డి, ఇంద్రేశం మున్సిపాలిటీలలోని 2వ వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ సార లావణ్య బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

# నెల్లూరు కేంద్రంగా సీఎం చంద్రబాబు హజ్ యాత్రకు సబ్సిడీ ప్రకటించారు.

**ఇచ్చిన మాట ప్రకారం లక్ష రూపాయలు సబ్సిడీ గా ఇస్తున్నారు. నెల్లూరు నుంచి హజ్ యాత్రకు వెళ్ళే వారికి హెల్త్ స్క్రీనింగ్ టెస్ట్ చేస్తున్నాం.**

**– ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్.**

నెల్లూరు కేంద్రంగా ప్రతిపక్షంలో నేటి సీఎం చంద్రబాబు హజ్ యాత్రికులకు లక్ష రూపాయలు సబ్సిడీ ప్రకటించారని, ఇచ్చిన మాట ప్రకారం లక్ష రూపాయలు సబ్సిడీగా అందిస్తున్నారని ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. నెల్లూరులోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఏపీ స్టేట్ హజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన హజ్ యాత్రికుల మెడికల్ స్క్రీనింగ్ మరియు వ్యాక్సినేషన్ క్యాంప్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంపు గురించి హజ్ యాత్రికులను అడిగి తెలుసుకున్నారు. టెస్టులు, వాక్సినేషన్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే 200 మందికి హెల్త్ స్క్రీనింగ్ టెస్ట్ మరియు వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. యాత్రకు వెళ్లాక ఆరోగ్య సమస్యలు ఎదురుకాకుండా ఇక్కడే బిపి,షుగర్, కిడ్నీ, లివర్ ఫంక్షన్, ఎకో, ఈసీజీ, టెస్ట్ లు చేయించి పంపుతున్నామని తెలిపారు. బ్రెయిన్ ఇన్ఫెక్షన్ కాకుండా, 65 ఏళ్ల పైబడిన వారికి ఇన్ఫెక్షన్ కాకుండా వ్యాక్సినేషన్ చేస్తున్నామని వివరించారు. తొలిసారిగా విజయవాడ నుంచి సౌదీ ఎయిర్లైన్స్ నడవబోతుందని తెలిపారు. క్యాంపులో కమ్యూనికేషన్ గ్యాప్ రాకుండా ముస్లిం డాక్టర్లను కూడా నియమించారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ హజ్ కమిటీ సభ్యులు మిర్జా, కార్పొరేటర్ కరిముల్లా, పెంచల నాయుడు, సాబీర్ ఖాన్, రియాజ్, ఇంతియాజ్, రసూల్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి కమిటీ సభ్యులు దారా మల్లీ, అబీదా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు వరంగా రూపం 12 వందల కోట్లు ఫీజు ఫీజ్ రీయింబర్స్ మెంట్ విడుదల

**లోకేష్ అన్నకు కృతజ్ఞతలు ర్యాలీ మరియు పాలాభిషేకం**



నందవరం ఎమ్మెల్యే డాక్టర్ బి వి జయ నాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు నందవరం కేంద్రంలో టిడిపి కార్యాలయం నుండి బస్టాండ్ వరకు మండల టిడిపి నాయకులు విద్యార్థులతో కలిసి భారీ నిర్వహించబడింది 1200 కోట్లు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేసి పేద విద్యార్థులకు వరంగా నిలిచిన కూటమి ప్రభుత్వానికి ముఖ్యంగా రాష్ట్ర ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి థాంక్యూ అన్న అంటూ విద్యార్థులు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ చంద్రబాబు నాయుడుకి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి కి పాలాభిషేకం నిర్వహించి ఆనందం వ్యక్తం చేశారు. పేద మరియు మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మండల టిడిపి కన్వీనర్ ఖాసిం వలి, కైరవాడి వీరేష్, దావీదు, సత్తిరెడ్డి, మచాపురం బడేసావలి, టిడిపి నాయకులు ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి మున్సిపల్ చైర్మన్ ఆకాశం కల్పించండి బి రమాదేవి కృష్ణ.



వనపర్తి మున్సిపల్ ఎన్నికల్లో 2 వార్డు నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శ్రీమతి బి రమాదేవి కృష్ణ వరుసగా 3 సార్లు విజయం సాధించి హ్యాట్రిక్ సాధించారు 1995 లో కాంగ్రెస్ పార్టీ 2 వార్డు లో గెలిచి 30 సంవత్సరాల తర్వాత నేడు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ గా శ్రీమతి బి రమాదేవి కృష్ణ గారు విజయం సాధించి కాంగ్రెస్ పార్టీకి బహుమానంగా నిలిచారు గతంలో బి కృష్ణ కూడా హైటెక్ సాధించారు 2 000 సంవత్సరాలో మున్సిపల్ వైస్ చైర్మన్ గా 2007 లో మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ గా 2014 లో మున్సిపల్ వైస్ చైర్మన్ గా వరుసగా 3 సార్లు విజయం సాధించి హ్యాట్రిక్ సాధించారు మున్సిపల్ ఎన్నికల్లో భార్యాభర్తలు హ్యాట్రిక్ సాధించడం చరిత్ర నే వనపర్తి పట్టణం అభివృద్ధి విషయంలో అనేక అనుభవం ఉన్న ధైర్యంగా నిజాయితీగా మున్సిపల్ చైర్మన్ ఇలా ఉండాలి అనే పేరు ప్రజల్లో తీసుకొస్తాను అవకాశం ఇవ్వండి అని కాంగ్రెస్ పార్టీ ని కోరుతున్నాను ఎమ్మెల్యే మేఘ రెడ్డి ని తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి ని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డి ని కోరుతున్నాను వనపర్తి ప్రజలు మమ్మల్ని కోరుకుంటున్నారు ఈ వనపర్తి ప్రజల కోసం విద్యార్థి దశ నుంచి అనేక ఉద్యమాలు ప్రజా సమస్యల కొరకు పోరాటాలు చేశాను అవకాశం ఇవ్వండి బి కృష్ణ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కాంగ్రెస్ నాయకులు వనపర్తిగత 30 సంవత్సరాలుగా వనపర్తి పట్టణంలో రెండో వార్డు పరిధిలో ప్రజలకు ఎన్నో సమస్యల మీద పరిష్కరిస్తూ వారికి అండగా ఉంటూ వారి అండతో 30 సంవత్సరాలుగా కౌన్సిలర్ అభ్యర్థిగా గెలుపొందుతూ ప్రజలకు సేవ చేస్తున్నామని ఈసారి ఈ కాంగ్రెస్ గవర్నమెంట్ మున్సిపల్ చైర్మన్ గా పి రమా దేవికి ఆకాశం కల్పించాలని ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఇన్చార్జి మంత్రికి ముఖ్యమంత్రికి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి కి ఎంపీ మరియు చేస్తున్నట్లు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బి కృష్ణ పత్రిక విలేకరుల ద్వారా కా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ పాఠశాలలలో, హాస్టల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించండి

**:- డీవీఎంసీ మెంబర్ లింగాల నాగరాజు**



పాములపాడు :- ప్రభుత్వ పాఠశాలలలో, హాస్టల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు కోరారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా పాములపాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి సంతృప్తి చెందుతూ ఈ సందర్భంగా డివిఎంసి మెంబర్ లింగాల నాగరాజు మాట్లాడుతూ స్కూల్ నందు దాదాపుగా 415 మంది విద్యార్థులు ఉండగా, ఇందులో ఈరోజు 265 మంది హాజరయ్యారని వీరికి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని ఆయన అన్నారు. అదే మాదిరిగా వంట రూమును శుభ్రంగా ఉంచుకోవాలని వంట మనుషులు బాధ్యతగా వ్యవహరించి ఎలాంటి లోపం లేకుండా భోజనం గాని, తాజా కూరగాయలతో కూరలు వండాలని అజాగ్రత్త చేస్తే సహించే పరిస్థితి లేదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో సన్నబియ్యాన్నే సరఫరా చేస్తుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, మంచి చదువులు చదవాలని స్కూలుకు మంచి పేరు తేవాలని ఆయన అన్నారు. భోజన విషయంలో ఎలాంటి లోపాలు జరిగినా జిల్లా కలెక్టర్ కి, స్థానిక శాసనసభ్యులు గిత్త.జయ సూర్య కి ఫిర్యాదు చేస్తానని ఆయన హెచ్చరించారు.

# అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కి సరైన గుణపాఠం చెబుతారు తలసాని



సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మీడియా సమావేశం నిర్వహించారు.

తలసాని మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో ఎన్నో అద్భుతాలు చూశారు. రాష్ట్రం సాధించడం ఒక్క అద్భుతమైన ఘట్టం. తెలంగాణ రాష్ట్రన్నీ అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని అనేక ప్రాజెక్ట్ లు నిర్మించారని అన్నారు.

గతంలో నీరు, విద్యుత్ లేక రాష్ట్రంలో రైతులు ఇబ్బంది పడ్డారు. పండించిన పంట కు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడితే కేసీఆర్ పంట సహాయం చేశారు. నేను టీడీపీ లో ఉన్నపుడు 5గంటలకు మించి విద్యుత్ రాకపోయేది. అందరి పోరాటం వల్ల వచ్చిన రాష్ట్రాన్ని కేసీఆర్ అద్భుతంగా తీర్చిదిద్దారు. జ. సిద్దిపేట ను హరీష్ రావు బాగా అభివృద్ధి చేశారు. రియల్ ఎస్టేట్ రంగం కాంగ్రెస్ ప్రభుత్వం లో కుదేలు అయిందని అన్నారు.

కేసీఆర్ హయాంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటితే కాంగ్రెస్ హయాంలో భూముల ధరలు పడిపోయాయి. కేసీఆర్ తెచ్చిన రైతుబంధు పథకంను ఐక్యరాజ్య సమితి అభినందించింది. కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పునాదులు మీద పుట్టి అన్ని దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని అధికారం నడిపిస్తుంది. మున్సిపల్ ఎన్నికల్లో డబ్బులు, మద్యం ఏరులై పారింది. – కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల్లో గుడ్డిలో మెల్ల లాగా గెలిచింది. మా కార్యకర్తలు ధైర్యంగా పోరాటం చేసి గెలుపొందారు. రాజకీయ వ్యవస్థలో ప్రభుత్వాలు ఎపుడు కూడా శాశ్వతం కాదు ప్రజలు శాశ్వతం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కి సరైన గుణపాఠం చెబుతారు. కాంగ్రెస్ ఎక్కడ ఒక్క ప్రాజెక్ట్ నిర్మించిన దాఖలాలు లేవు. ఆర్ టి సి లో మహిళా లకు ఫ్రీ పెట్టి పురుషులకు డబుల్ రెట్లు పెంచారని విమర్శించారు..

# శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలకు వచ్చేభక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు

**బద్వేల్ ఆర్డీవో చంద్ర మోహన్**

**ఆలయాలు సందర్శించిన ఆర్డిఓ అధికారులు నాయకులు**



బద్వేలు శివరాత్రి మహోత్సవాలకు ఆలయాలకు వచ్చేభక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు బద్వేల్ ఆర్డిఓ చంద్ర మోహన్ తెలిపారు శనివారం ఆయన అధికారులు నాయకులతో కలిసి పలు ఆలయాలు సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు మహాశివరాత్రి పర్వదినము సందర్భంగా గోపవరం మండలం మల్లెం కొండ నందు భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో కలసి పరిశీలన చేసి తగు సూచనలు చేయడం జరిగింది. ఆర్డీవో తో పాటు ఏపీఐఐసీ రాష్ట్ర డైరెక్టర్ ప్రసాద్ రెడ్డి గోపవరం మండల జడ్పిటిసి జయరాంరెడ్డి గోపవరం టిడిపి అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి పలువురు నాయకులు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు కాగా బద్వేలు ఆర్టీసీ బస్టాండ్ నుండి శివ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ప్రవేశపెట్టారు లంక మల్ల బ్రహ్మంగారిమఠం మల్లెం కొండ భైరవకోన తదితర శివ క్షేత్రాలకు బస్సులు ప్రవేశపెట్టారు అలాగే వందలాదిమంది భక్తులు శనివారం నుండి ప్రైవేటు వాహనాల్లో శివ క్షేత్రాలకు బయలుదేరి వెళ్లారు

# మహాశివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం... ధర్మకర్త అప్పా వేణు గోపాల్ రాయల్

తుగ్గలి:మండల పరిధిలోని గల ఉప్పర్లపల్లె గ్రామ సమీపంలోని గల బోడబండ పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ పకీరప్ప గురుస్వాములు,శ్రీ యల్లప్ప గురుస్వాములు మరియు శ్రీ ఆంజనేయులు తాత వారి మహాశివరాత్రి ఉత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైనట్లు ఆలయ ధర్మకర్త అప్పా వేణుగోపాల్ రాయల్ తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ తేదీ ఆదివారము ఉదయం అప్పా చంద్రశేఖర్ ఇంటి నుండి స్వామి వారి ఆభరణములు శ్రీ పక్కీరప్ప స్వామి దేవస్థానమునకు చేరుతాయని,అనంతరం అప్పా వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారని ఆయన తెలియజేశారు. ఆదివారము సాయంత్రం శ్రీ బోడబండ పక్కిరప్ప స్వామి,శ్రీ యల్లప్ప స్వామి ఉత్సవమూర్తులు అప్పా సంజీవులు, అప్పా సురేష్,అప్పా రవి,అప్పా లక్ష్మి నారాయణ ఆధ్వర్యమున అప్పా వెంకటరాముని ఇంటి నుండి ఊరేగింపు జరిగినపిమ్మట బోడబండ దేవస్థానంకుచేరుతాయని తెలియజేశారు. 16వ తేదీ సోమవారము ఉదయం 8 గంలకు శ్రీ పక్కీరప్ప స్వామి,శ్రీ యల్లప్ప స్వామి,శ్రీ ఆంజనేయులు తాత ఉత్సవమూర్తులు అప్పా నారాయణ స్వామి ఆధ్వర్యంలో గంగాస్నానం నిర్వహిస్తారని,అనంతరం 11గంల నుండి పెరవలి గ్రామము గవ్వల గురునాథము,మొగలగవెల్లి గ్రామ వాస్తవ్యులు శ్రీ రంగన్న తాత,శ్రీ పక్కీరప్ప తాత భక్తాదులు మరియు హైదరాబాద్ శ్రీరాములుచే అన్నదాన కార్యక్రమము జరుగునని,సోమవారం సాయంత్రం 5 గంలకు శ్రీ పక్కీరప్ప స్వామి,శ్రీ యల్లప్ప స్వామి శ్రీ ఆంజనేయులు తాత గార్ల రథోత్సవము అప్పా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరుగుతుందని వారు తెలియజేశారు. 18వ తేదీ బుధవారం స్వామి వారి హుండి అప్పా వేణు (ధర్మకర్త),అప్పా నారాయణ స్వామి,అప్పా సత్యన్న, అప్పా వెంకటరాముడు,అప్పా వెంకటేశ్,అప్పా సురేష్ ల ఆధ్వర్యంలో లెక్కించబడునని ఆలయ ధర్మకర్త అప్పా వేణు తెలియజేశారు. మహా శివరాత్రి వేడుకలకు భక్తాదులందరు విచ్చేసి శివరాత్రి వేడుకలను విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త అప్పా వేణు తెలియజేశారు. 15వ తేదీ ఆదివారం రోజున రాత్రి 9 గంటలకు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఉచిత నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త అప్పా వేణు రాయల్ తెలియజేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జొన్నగిరి ఎస్సై మల్లికార్జున తమ పోలీస్ సిబ్బందితో కలిసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఎం.ఎల్.ఎ క్యాంపు కార్యాలయంపై గులాబీ జెండా.





వనపర్తి. ధనప్రవాహం, ప్రలోభాలను తట్టుకొని పట్టు నిలుపుకున్న నిరంజనుడు. హోరాహోరీగా పోరాడిన బి.ఆర్.ఎస్ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపిన నిరంజన్ రెడ్డి. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఈరోజు బి.ఆర్.ఎస్,సి.పి.ఎం.పార్టీ నుండి గెలిచిన కౌన్సిలర్స్ ను సన్మానించి అభినందించారు.

ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగం,ధన ప్రవాహం,ప్రలోభాలకు పాల్పడి విజయం సాధించిందని నైతిక విజయం తమదేనని అన్నారు. బి.ఆర్.ఎస్ పార్టీ హయాంలో కేవలం 5సీట్లు మాత్రమే కాంగ్రెస్ సాధించిందని

నేడు ప్రతిపక్షంగా పోరాటం సాగిస్తూ 8సీట్లలో బి.ఆర్.ఎస్,మిత్రపక్షంగా సి.పి.ఎం పార్టీ 1సీటు మొత్తం 9స్థానాలలో విజయం సాధించడం సంతోషం అని అన్నారు. 4,5,12 సీట్లలో స్వల్ప మెజారిటీతో ఓడిపోయామని, స్వయంగా ఎం.ఎల్.ఏ క్యాంపు కార్యాలయం వార్డులో గులాబీ జెండా రెపరెపలాడించామని ఓట్లపరంగా ప్రజలలో బి.ఆర్.ఎస్ పార్టీకి ఆదరణ పెరిగిందని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో హోరాహోరీగా పోరాడిన అభ్యర్థులకు,శ్రమించిన బి.ఆర్.ఎస్ శ్రేణులకు నిరంజన్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# కాంగ్రెసు ప్రతినిధులా ? ప్రభుత్వ అధికారులా ?



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 14 ఫిబ్రవరి 2026**నెక్నంపూర్ డివిజన్ పరిధి లోనీ పెద్ద చెరువులో కలుస్తున్న కలుషిత నీటిని శుద్ధి చేసి ఇబ్రహీం బాగ్ చెరువుకు తరలించమని అధికారులను స్థానిక బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, స్థానిక నాయకులు పలుమార్లు కోరడమైనది. సంబంధిత పనుల కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అమృత్ 2 పథకం కింద 2.35 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయినవని, అట్టి పనులు మొదలు పెట్టే సమయములో మునిసిపల్ డివిజనల్ అధికారి, ఇరిగేషన్ శాఖ అధికారి మరియు చెరువుల పరిరక్షణ హైడ్రా అధికారులతో పాటు కాంట్రాక్టర్ ముందుండి పనులు కొనసాగించడం సబబే, కానీ ఇట్టి పర్యవేక్షణలో అసంబంధిత రాజకీయ నాయకులు పాల్గొనడం జరిగినదనీ, ప్రత్యేకముగా మాజీ మణికొండ మున్సిపల్ కౌన్సిల్ చైర్మన్ తో పాటు కాంగ్రెసు పార్టీ నాయకులు మాత్రమే పాల్గొనడంలో ఎవరి ప్రమేయం ఎంత ఉన్నదని ప్రజలు గొంతెత్తి ప్రశ్నిస్తున్నారు. అసలు సిసలైన అధికారులు సమ న్యాయం పాటిస్తూ ముందుకు సాగాలని, కానీ ఇక్కడ కొంతమంది అధికారులు రాజకీయ నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని అందుకు బదులుగా ఉద్యగాలకు రాజీనామా చేసి కాంగ్రెసు పార్టీ కండువా కప్పుకొని రాజకీయ నాయకుల పాత్ర పోషిస్తూ పెద్ద నాయకులకు వత్తాసు పలికితే బాగుంటుందని హితవు చెప్పడం జరిగినది. అదేమీ కుదరదు మెమిలాగే వ్యవహరిస్తామని అంటే అట్టి వారిపై ప్రజల మద్దతుతో ప్రజాస్వామ్య పద్ధతిలో పై అధికారుల దృష్టికి తీసుకెళ్ళ గలమణి హెచ్చరిస్తూ, తద్వారా పార్టీ నాయకులకు వత్తాసు పలికే అధికారులపై చట్ట పరిధిలో పై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తున్న వారిలో స్థానిక బి ఆర్ ఎస్ స్థానిక వర్కింగ్ ప్రెసిడెంట్ కుంబగళ్ళ ధనరాజ్, గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్ రావు, బండమీది మల్లేశ్, భానుచందర్, బొడ్డు శ్రీధర్, షేక్ ఆరిఫ్, సుమన్, దేవి ప్రియ, తది తర నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పోరులో ఆకుల చిట్టిబాబు విజయదుందుభి రెండు వార్డుల గెలుపులో కీలక పాత్ర పోషించిన కౌన్సిలర్



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 14 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** ఆందోల్- జోగిపేట మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల్లో, 15వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, 205, ఓట్ల భారీ మెజారిటీతో, ఘన విజయం సాధించి, తన రాజకీయ పట్టును నిరూపించుకున్నారు, గత ఎన్నికల్లో 17వ, వార్డు నుండి ప్రాతినిధ్యం వహించిన ఆయన, ఈసారి రిజర్వేషన్ మార్పుల కారణంగా, 15వ వార్డు నుండి పోటీ చేయగా, అక్కడ మైనార్టీ,రజక, ఆర్యవైశ్య, మరియు ముదిరాజ్, సామాజిక వర్గాల అఖండ మద్దతుతో, బిఆర్ఎస్ అభ్యర్థిపై సునాయాసంగా విజయం సాధించారు, రెండోసారి కౌన్సిలర్ గా, ఎన్నికైన చిట్టి బాబుకు, మద్దతుగా అభిమానులు, యువకులు, మరియు మైనార్టీలు, కౌంటింగ్ కేంద్రం నుండి పట్టణం వరకు, భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించి, బాణసంచా కాల్చుతూ, బ్యాండ్ మేళాల మధ్య, ఆయనను ఘనంగా సన్మానించారు, కాగా 15వ వార్డులో విజయం సాధించడంతో పాటు, 17వ వార్డు, ఎస్టి,అభ్యర్థి గెలుపులోను, వ్యూహాత్మకంగా వ్యవహరించి, కీలక పాత్ర పోషించిన చిట్టిబాబును, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఆయనను ప్రత్యేకంగా అభినందించారు, ఐదేళ్ళుగా ఆయా వార్డులలో చేపట్టిన, సామాజిక సేవలు, మరియు అభివృద్ధి కార్యక్రమాలే, కాంగ్రెస్ పార్టీని కంచుకోటల మార్చాయని, మంత్రి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, రెండు వార్డుల విజయంలో భాగస్వామ్యం కావడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి......

## పుట్టిన రోజున విద్యార్థులకు ఎగ్జామ్స్ ప్యాడ్,పెన్నులు,స్కేల్స్ పంపిణీ



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 14 :** మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలం యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ మోటపలుకుల తరుణ్ కుమార్ జన్మదిన సందర్భంగా విద్యార్థులకు,ఎగ్జామ్స్ ప్యాడ్,పెన్నులు,స్కేల్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలంలోని కొర్విచేల్మ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 20 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్,పెన్స్ స్కేల్స్ డొనేట్ చేయడం తెలుపారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఇష్ణవేణి విష్ణు,ముత్తే రవి వర్మ,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు,

## రూ 20 కోట్లతో పరిశోధనా కేంద్రం ఏర్పాటు

హైదరాబాద్ సమగ్ర ఇంజినీరింగ్ సేవలు అందించేందుకు తమ వ్యాపారాన్ని విస్తరిస్తున్నట్లు స్టాండర్డ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ వెల్లడించింది. ఇందుకోసం జిన్నారం దగ్గర రూ.240 కోట్లతో హెవీ ఇంజినీరింగ్ ఉత్పత్తుల విభాగాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు సంస్థ ప్రమోటర్, మేనేజింగ్ డైరెక్టర్ కందుల నాగేశ్వర రావు తెలిపారు. సంస్థకు కొత్త కార్పొరేట్ పేరును (స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ నుంచి స్టాండర్డ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ) ప్రకటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. చమురు, గ్యాస్, న్యూక్లియర్ ప్లాంట్లలో ఉపయోగించే ఉత్పత్తుల తయారీ చేపట్టనున్నట్లు వివరించారు. తొలి దశలో రూ.120 కోట్లు పెట్టుబడి పెడుతున్నామని, 2027 జూన్లో ఉత్పత్తి ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. త్వరలోనే ఐటీ సంస్థలకూ విస్తరించబోతున్నట్లు తెలిపారు. కొత్త తరం సాంకేతికతల కోసం రూ.20 కోట్లతో పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విజయవాడ రైల్వే స్టేషన్లో కదులుతున్న రైలు ఎక్కుతూ.. ఒక ప్రయాణికుడు ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. అక్కడే ఉన్న ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ ఎం.నరసింహారావు వెంటనే స్పందించి, ఆ ప్రయాణికుడిని ప్లాట్ఫారమ్ పైకి లాగి ప్రాణాలు కాపాడారు. అనంతరం ఎమర్జెన్సీ బ్రేక్ వేసి రైలును నిలిపివేశారు. కానిస్టేబుల్ సమయస్ఫూర్తిని ప్రయాణికులు మరియు అధికారులు అభినందిస్తున్నారు.

# క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 14 :** క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు అలవాడతాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో కొనసాగుతున్న సి.ఎం.కప్ 2025 పోటీలకు జిల్లా యువజన క్రీడా సేవల అధికారి గుర్రాల హనుమంత రెడ్డి,జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి అధికారులు, క్రీడాకారులతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామీణ స్థాయి నుండి యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యతను వెలికి తీసేందుకు ప్రభుత్వం సి ఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తుందని తెలిపారు.క్రీడల ద్వారా శారీరక,మానసిక ఆరోగ్యం కలుగుతుందని,క్రీడలతో ప్రశాంతత అలవాటు అవుతుందని తెలిపారు. నాయకత్వ లక్షణాలతో టీం వర్క్ ప్రాధాన్యత తెలుస్తుందని,కలిసి పని చేయడంతో ఏదైనా సాధించవచ్చు తెలిపారు.క్రీడలలో గెలుపు, ఓటములు సామాన్యమని,క్రీడా స్ఫూర్తితో ఆటలలో పాల్గొనాలని తెలిపారు. ఒకసారి ప్రయత్నించి రాలేదు అని నిరుత్సాహపడకుండా సాధించే వరకు ఫలితం ఆశించకుండా ప్రయత్నిస్తూనే ఉండాలని తెలిపారు.సి.ఎం.పోటీలలో భాగంగా గ్రామీణ,మండల, నియోజకవర్గస్థాయి స్థాయి పోటీలను పూర్తి చేసుకుని జిల్లా స్థాయి పోటీలను నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలకు జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్,బెల్లంపల్లి నియోజకవర్గాల నుండి దాదాపు 400 మంది క్రీడాకారులు హాజరయ్యారని,అథ్లెటిక్స్,



బాస్కెట్బాల్,జిమ్నాస్టిక్స్, రూలర్ స్కేటింగ్, స్విమ్మింగ్, రెజ్లింగ్, సైక్లింగ్ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల సమయంలో సిబ్బంది సహకారం తక్కువగా ఉన్నప్పటికీ జిల్లాలో క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఒలంపిక్స్ లో తెలంగాణ రాష్ట్రం నుండి పాల్గొని పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడల కోటాలో ఉద్యోగ అవకాశాలు కూడా సాధించవచ్చు అని,క్రీడాకారులు ఏకాగ్రతతో శిక్షణ పొంది క్రీడలలో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,వివిధ క్రీడ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో బిజెపి పార్టీ కృతజ్ఞత సమావేశం.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** శనివారం రోజున వేములవాడ పట్టణ బిజెపి శాఖ ఆధ్వర్యంలో పత్రిక సమావేశం స్థానిక పద్మశాలి సంఘంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు రా పెల్లి శ్రీధర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 11వ తేదీన జరిగిన వేములవాడ మున్సిపల్ ఎన్నికలలో బిజెపి పార్టీకి మద్దతు తెలిపిన ప్రతి ఒక్క పట్టణ ఓటర్లకు ధన్యవాదాలు తెలియజేస్తూ, ప్రత్యేకించి 24వ వార్డులో తనను ఆదరించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ వేములవాడలో ప్రజల బిజెపికి మద్దతు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. వేములవాడ పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి సరియైన మెజార్టీ ఇవ్వకుండా ప్రజల బుద్ధి చెప్పారని ఇకనైనా కాంగ్రెస్ పార్టీ పద్ధతులు మార్చుకోవాలని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో రేగుల రాజకుమార్, వాసం మల్లేశం యాదవ్, డాక్టర్ వెంకన్న, అన్నం నరసయ్య, బిల్లా కృష్ణ, శ్యామ్ సుందర్, నామాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## యాసంగి పంట పెట్టుబడి సహాయాన్ని వెంటనే విడుదల చేయాలి బిజెపి మండల అధ్యక్షులు భూమల్లఅనిల్ కుమార్



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి ఫిబ్రవరి 15: అమలు కానీ ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల రెండు నెలలు అవుతున్న ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తూనే ఉందని బీజేపీ మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్ అన్నారు. ఎన్నికల హామీల్లో నమ్మి మోసపోయిన వాళ్ళలో రైతులే ముఖ్యంగా ఉన్నారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఎన్నికల సమయంలో రైతులకు రైతు భరోసా పేరు తో 15000 ఇస్తానని ఇవ్వలేదని అన్నారు. కౌలు రైతులకు సంవత్సరానికి 12,000 చొప్పున ఇస్తా అని చెప్పి ఇవ్వలేదని అన్నారు. వడ్లకు బోనస్ గా 500 రూపాయలు ఇస్తా అని చెప్పి ఇప్పటివరకు దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వనేలేదన్నారు. పంట పెట్టుబడి సహాయంగా రైతుకు అందాల్సిన 2024 ఖరీఫ్ అమౌంట్ ఇప్పటివరకు అందజేయలేదని అన్నారు. ప్రస్తుతం డిసెంబర్ జనవరి నెలలో జమ చేయవలసిన యాసంగి పెట్టుబడి అమౌంట్ కూడా జమ చేయలేదని అన్నారు. కానీ పరిషత్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ కార్పొరేషన్ లో మాట్లాడుతూ సంబంధం లేకుండా రైతు భరోసా విషయం మాట్లాడారని అన్నారు. పట్టణాల్లో కార్పొరేషన్ లో రైతు భరోసా విషయం మాట్లాడాల్సిన అవసరం లేదని అన్నారు. కానీ రాబోయే పరిషత్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, రైతు భరోసా విషయాన్ని మళ్ళీ లేవనెత్తారని ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. రైతులు ప్రతి విషయాన్ని గమనిస్తున్నారని అన్నారు. 2024 ఖరీఫ్ లో బాకీ పడిన పెట్టుబడి సాయాన్ని గుర్తుంచుకున్నారని, అదేవిధంగా డిసెంబర్ జనవరి వేయాల్సిన ప్రస్తుత సాయాన్ని కూడా గమనిస్తున్నరని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల యొక్క విశ్వాసాన్ని కోల్పోయిందని రాబోయే పరిషత్ ఎన్నికల్లో ఖచ్చితంగా బుద్ధి చెప్తారని ఈ సందర్భంగా తెలియజేశారు. తక్షణమే రైతు పెట్టుబడి సాయం విడుదల చేయాలని, లేని పక్షంలో పార్టీ కార్యాచరణ అనుగుణంగా ఉద్యమిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మేకల మల్లేశం జిల్లా కౌన్సిల్ మెంబర్ బత్తిని సాయ గౌడ్, జిల్లా నాయకులు కొలనురు ముత్తవ్వ, నాయకులు పినికాసి అనిల్, భూత్ అధ్యక్షులు తుమ్మలపెల్లి కమలాకర్ రావు ,పిల్లి గోపాల్ పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలి.

## సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కె .ఎస్. శ్రీనివాస్ రాజు.
## రాజన్న భక్తులకు ఆర్టీసీ ఉచిత రవాణా బస్సుల ప్రారంభం.
## రాజన్న ఆలయ విస్తరణ పనులను ఇన్చార్జి కలెక్టర్ గరీమ అగ్రవాల్ తో కలిసి పరిశీలన.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎస్ఎస్ శ్రీనివాసరాజ్ ఆదేశించారు. శ్రీ భీమేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు వేములవాడకు రాగా, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. శ్రీ భీమేశ్వర ఆలయంలో అర్చకులు సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీకి స్వస్తితో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు స్వామివారి ప్రసాదాన్ని అందజేసి, ఆశీర్వచనం అందించారు.

ఆలయ విస్తరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన.

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎస్ శ్రీనివాస్ రాజు ఇన్చార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనులకు సంబంధించిన ఫోటోలు పరిశీలించారు. పనులపై పలు సూచనలు చేశారు.

రాజన్న భక్తులకు ఉచిత బస్సు సర్వీసులు ప్రారంభం.

వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండ్ నుంచి రాజన్న ఆలయం వరకు భక్తులను ఉచితంగా తరలించే ఆర్టీసీ బస్సులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కె ఎస్ ఎస్ శ్రీనివాస్ రాజ్, ఇన్చార్జి కలెక్టర్ కరీమా అగ్రవాల్ తో కలిసి ప్రారంభించారు.




ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాలి.

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను ఒక ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆదేశించారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇన్చార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ తో కలిసి ఆర్ అండ్ బి, ఆలయ అధికారులు, ఆర్కిటెక్ట్ మూర్తి, కాంట్రాక్టర్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ప్రధాన ఆలయ విస్తరణ, ఇతర ఆలయ అభివృద్ధి పనికి సంబంధించి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. పనుల్లో వేగం పెంచాలని, అవసరమైన పని వారి సంఖ్యను మరింత పెంచాలని ఆదేశించారు. పనుల పురోగతిలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. నాణ్యతతో పనులను పూర్తి చేయాలని సూచించారు. నూతన గోశాల నిర్మాణం, ఇతర అంశాలపై చర్చించారు. ఇప్పుడు ఉన్న గోశాలలో ఎన్ని కోడెలు ఉన్నాయని, ఆరా తీశారు. వాటి సంరక్షణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ, గుడి చెరువు బండ్ పార్క్ పనులపై సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేసి వివరించారు.

ఈ సమావేశంలో ఆర్ అండ్ బి సి ఇ రాజేశ్వర్, ఎస్సీ రాములు, ఈ ఈ నరసింహ చారి, ఆలయ ఈ ఈ రాజేష్, జిల్లా వ్యవసాయ అధికారి అబ్జల్ బేగం, జిల్లా పసుపు సమర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పుల్వామా దాడిలో వీరమరణం పొందిన జవాన్లకు నివాళులర్పిస్తూ, వేములవాడలో రక్తదాన శిబిరం.




**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** శనివారం రోజున వేములవాడ పట్టణంలోని మల్లారం రోడ్డు లో గల మాతృశ్రీ ఆసుపత్రి ఆధ్వర్యంలో లైన్స్ క్లబ్ మరియు యువ చైతన్య దీపం స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఫిబ్రవరి 14వ తేదీ 2019 సంవత్సరంలో పుల్వామా దాడిలో వీరమరణం పొందిన వీర జవాన్లకు నివాళు లర్పిస్తూ మాతృశ్రీ ఆసుపత్రి నందు రక్తదాన శిబిరం, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు సెంటర్ వారి సహకారంతో నిర్వహించడం జరిగింది. ఈ రక్తదాన శిబిరంలో 20 మంది దాతలు రక్తదానం చేసినారు. రక్తదాన శిబిరానికి మాతృశ్రీ హాస్పిటల్ డాక్టర్ మరియు లైన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ చీకోటి సంతోష్ కుమార్, నేతృత్వంలో ఈ రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ రక్తదాన శిబిరానికి యువ చైతన్య దీపం ఫౌండేషన్ చైర్పర్సన్ శేఖర్ సేనాధిపతి లైన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు గోగికార్ శ్రీనివాస్, తీగల వెంకటేశ్వరరావు, కోశాధికారి డాక్టర్ కోయి నేని ప్రవీణ్, గడప రఘుపతి రావు, నవీన్ లకావత్, యువ చైతన్య దీపం స్వచ్ఛంద సంస్థ నియోజకవర్గ ఇన్చార్జి భాస్కర్, మాతృశ్రీ ఆసుపత్రి సిబ్బంది, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించడానికి సహాయ సహకారాలు అందించిన అందరికీ మాతృశ్రీ ఆసుపత్రి యాజమాన్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




# ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండా గుండె వాల్వ్ చికిత్స

సికింద్రాబాద్... వృద్ధాప్యంలో గుండె ఆపరేషన్ అంటే ప్రమాదమనే భయాన్ని చెదరగొడుతూ, ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండానే 72 ఏళ్ల వృద్ధురాలికి మిట్రల్ వాల్వ్ లీకేజీపై చికిత్స అందించ అరుదైన విజయం సాధించినట్లు సికింద్రాబాద్‌లోని మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు తెలిపారు.కొన్ని నెలలుగా ఆమెకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చిన్న పని చేసినా ఆయాసం, తీవ్ర అలసట వంటి సమస్యలు ఉండేవి. మొదట వీటిని వయస్సు ప్రభావంగా భావించి నిర్లక్ష్యం చేశారు. అయితే పరిస్థితి విషమించి గుండె వైఫల్యంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. పరీక్షల్లో ఆమె మిట్రల్ వాల్వ్‌లో తీవ్రమైన లీకేజ్ ఉన్నట్లు గుర్తించారు. వైద్యుల ప్రకారం, భారతదేశంలో 65 ఏళ్లు పైబడిన వారిలో ప్రతి 10 మందిలో ఒకరికి వాల్వ్ సంబంధిత సమస్యలు ఉండే అవకాశం ఉంది.ఆమె వయస్సు మరియు ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఓపెన్ హార్ట్ సర్జరీ ప్రమాదకరమని భావించారు. దీంతో మల్టీడిసిప్లినరీ హార్ట్ టీమ్ కేసును సమగ్రంగా పరిశీలించింది. కాథెటర్ ద్వారా మినిమల్ ఇన్వేసివ్ పద్ధతిలో చికిత్స నిర్వహించారు. కాలి రక్తనాళం ద్వారా చిన్న ట్యూబ్ పంపించి, ఆధునిక ఇమేజింగ్ సాయంతో వాల్వ్ లీకేజీని తగ్గించారు.ఈ సందర్భంగా డా. ప్రమోద్ కుమార్ కుచులకంటి మాట్లాడుతూ, “వృద్ధుల్లో కనిపించే ఆయాసం, అలసటను కేవలం వయస్సు కారణంగా భావించకూడదు. సకాలంలో పరీక్షలు చేయించుకుంటే ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండానే ఆధునిక పద్ధతుల్లో సురక్షితంగా చికిత్స చేయవచ్చు. హార్ట్ టీమ్ సమిష్టి నిర్ణయం వల్ల ప్రతి రోగికి తగిన చికిత్సను ఎంపిక చేయడం సాధ్యమవుతోంది,” అన్నారు.ప్రస్తుతం రోగి స్థిరంగా ఉండి, శ్వాసలో గణనీయమైన మెరుగుదలతో రోజువారీ పనులు స్వయంగా చేసుకుంటున్నారు.మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యం సహకారంతో ఇటువంటి అత్యాధునిక గుండె చికిత్సలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని వైద్య బృందం తెలిపారు.

# నిఘ నీడలో భీమన్న క్షేత్రంబి175 సీసీ కెమెరాలతో కట్టుదిట్టమైన పర్యవేక్షణ.





**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** మహాశివరాత్రి జాతర సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ యంత్రాంగం విస్తృతంగా భద్రత ఏర్పాట్లు చేపట్టారు. భీమన్న ఆలయ ప్రాంగణం తో పాటు, వేములవాడ పట్టణ కేంద్రంలోని కీలక ప్రాంతాల్లో మొత్తం, 175 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానం చేసి జాతర ప్రాంగణం, ట్రాఫిక్ రద్దీ, క్యూలైన్లు, పార్కింగ్ ప్రదేశాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తిన వెంటనే కమాండ్ కంట్రోల్ నుండి వైర్లెస్ సెట్ ద్వారా సంబంధిత సిబ్బందికి సమాచారాన్ని చేరవేస్తున్నారు.

రాజన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారి దర్శనం చేసుకునేలా, అలాగే అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు.

# కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న జరిగే నిరాహార దీక్షను జయప్రదం చెయ్యండి

## జిల్లా కల్లుగీత కార్మిక సంఘం ఉపాధ్యక్షులు అంజు గౌడ్



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 14 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** జిల్లా కల్లు గీత కార్మిక సంఘం ఉపాధ్యక్షులు అంజాగౌడ్,ఈరోజు శుక్రవారం నారాయణఖేడ్,పట్టణంలోకల్లుగీత కార్మిక సంఘం నారాయణఖేడ్ డివిజన్ కమిటీ ముఖ్య నాయకుల సమావేశం నరసింహ గౌడ్ అధ్యక్షతన జరిగింది, ఈ సందర్భంగా కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంజాగౌడ్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు గౌడ సోదరులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బడ్జెట్లో గౌడ కులస్థుల సంక్షేమం కోసం గీత కార్మికుల ఉపాధి కోసం 5000 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 17న హైదరాబాదులోనీ ఇందిరాపార్క్ వద్ద కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆద్వార్యాంలో నిరహారదీక్ష నిర్వహించడం జరుగుతుందనీ ఈ యొక్క నిరాహార దీక్షకు జిల్లా లోని గౌడ సోదరులు గీతా కార్మికలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచారు రాష్ట్ర గీత కార్మికులకు పెన్షన్లు మంజూరు చేయడం లేదని ఇచ్చిన వారికి 4 వేల పెన్షన్ ఇస్తామని ఇచ్చిన ఆమెని అమలు చేయాలని దరఖాస్తు చేసుకున్న గీత కార్మికులందరికీ కొత్త పెన్షన్ మంజూరు చేయాలి పెండింగ్ లో ఉన్న ఎనిమిది వందల మందికి సుమారు 14 కోట్ల ఎక్స్గ్రేషియను వెంటనే విడుదల చేయాలని గత బడ్జెట్లో కేటాయించిన 70 కోట్ల నిధులను వెంటనే విడుదల చేసి ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు గీత కార్మికుల ఉపాధి కోసం గౌడ కులస్తుల సంక్షేమం కోసం జరిగే ఈ నిరాహార దీక్ష లో అందరు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో డివిజన్ గౌరవ అధ్యక్షులు నరసింహ గౌడ్ జయ రామచంద్ర గౌడ్ విట్టల్దాస్ గౌడ్, భూమా గౌడ్ బాగా గౌడ్ అంజాగౌడ్ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

# మాతృదేవోభవ

# ఘనంగా ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ 7వ ఆవిర్భావ దినోత్సవవేడుకలు



ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ 7వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు తెలంగాణ వరంగల్ సమీపానగల పశీతిని గ్రామం లోని సూర్య వశిష్ట గోశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ డిపి మిశ్రా చైర్మన్ రామాలయం ఫౌండేషన్ ఢిల్లీ మాట్లాడుతూ కులమత ప్రాంతాలకు అతీతంగా ప్రజల్లో ఐక్యమత్యం పెరగాలని అలాగే గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కొబ్బరి కాయను జాతీయ ఫలంగా ప్రకటించాలని కోరారు ఈ సందర్భంగా వారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తొందరగా అమలు చేయాలని సూచించారు కార్యక్రమం లో గౌరవ అతిథిగా పాల్గొన్న విద్యార్థి నాయకుడు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు ఓబీసీ జాతీయ అధ్యక్షులు ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని అందుకు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు ఈ సందర్భంగా ప్రముఖ జ్యోతిష్య శాస్త్రవేత్త మేధావి నూకల సూర్యనారాయణ గారిని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా ఏకగ్రీవంగా తీర్మానించి ప్రకటించారు నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ శ్రీ నారగోని మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి మరియు ఐకమత్యనికై దేశవ్యాప్తంగా పర్యటించనున్నట్లు తెలిపారు సూర్య వశిష్ట గోశాల వ్యవస్థాపకులు అవసరాల ప్రసాద్ శర్మ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ప్రజా సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించడానికి అన్ని పార్టీలు ఐకమత్యంతో కృషి చేయాలని తెలిపారు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబిశ్రీధర్ మాట్లాడుతూ ప్రజలు అధికారం ఇస్తే మాతృ ప్రేమతో పరిపాలిస్తామని తెలిపారు కార్యక్రమంలో రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రవణ్ ఆధ్యాత్మిక గురువు సీతారామరెడ్డి సామాజికవేత్త మణికంఠం ఐపీసీ పార్టీ అడ్వైజర్ చిత్ర తెలంగాణ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాదెండ్ల సుధాకర్ మహిళా ప్రెసిడెంట్ డాక్టర్ పద్మిని నేషనల్ కోఆర్డినేటర్ సెల్వరాజ్ యూత్ విభాగం జనరల్ సెక్రటరీ నవీన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సరిత ఐ ఎన్ టి యు సి లీడర్ అమీర్ భాయ్ సామాజికవేత్త రామచందర్ ఎక్స్ ఆర్మీ బొంతు వెంకటరమణ శ్రీను తదితరులు పాల్గొన్నారు

## సామాజిక న్యాయానికి సంక్షేమానికి బడ్జెట్లో పెద్దపీట

### ప్రజల అభ్యున్నతికి,ప్రజా సంక్షేమ అభివృద్ధికి తగిన బడ్జెట్.

### పేదల సంక్షేమానికి ,రాష్ట్ర ప్రగతికి ఇది మెరుగైన బడ్జెట్

### ఏపీ బడ్జెట్ పై స్పందించినమాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి

పుట్టపర్తి: 14ప్రజల సంక్షేమానికి రాష్ట్ర అభివృద్ధికి అన్ని వర్గాలకు మేలు జరిగే విధంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. విజయవాడ అమరావతిలో లోని రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం ప్రవేశపెట్టిన రాష్ట్ర ఆర్థిక బడ్జెట్ పై మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి స్పందించారు. ఈ బడ్జెట్లో సామాజిక న్యాయానికి ప్రజల సంక్షేమానికి రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేశారని తెలిపారు. సంక్షేమం అభివృద్ధి రెండు సమాన స్థాయిలో అమలు జరిగే విధంగా మెరుగైన బడ్జెట్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. ముఖ్యంగా రాష్ట్ర స్థితిగతులను మార్చే బడ్జెట్ ఇది అన్నారు. మరీ ముఖ్యంగా కరువు ప్రాంతమైన రాయలసీమ కరువు రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఈ బడ్జెట్ లో 30 వేల కోట్లతో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్ గా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించడం ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి 6600 కోట్లు వ్యవసాయానికి 11745 కోట్లు, సాగునీటి రంగానికి రూ.9906 కోట్లు, ఎస్సీ ,ఎస్టీ ,బీసీ ,మైనార్టీ సంక్షేమానికి గతంలో ఎన్నడూ లేనంతగా కూటమి ప్రభుత్వంలో ఈ బడ్జెట్లో నిధులు కేటాయించి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. తల్లికి వందనం పథకానికి 9668 కోట్లు, జల జీవన్ మిషన్ పథకానికి 4000 కోట్లు ఎన్టీఆర్ వైద్య సేవకు 4000 కోట్లు గృహ నిర్మాణానికి 54 51 కోట్లు,గ్రామాభివృద్ధికి 22941 కోట్లు, ఉద్యోగులకు డీఏ 1100 కోట్లు ,ఉద్యోగులు ,కర్షక, కార్మిక రంగానికి అత్యంత పెద్దపీట వేశారని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా రూ.4వేల కోట్లు కేటాయించడం వల్ల పుట్టపర్తి నియోజకవర్గంలో ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు ఇచ్చేందుకు ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. వైద్య ఆరోగ్య రంగానికి 19306 కోట్లు బడ్జెట్లో కేటాయించి ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేసిందని తెలిపారు. ప్రజలకు మెరుగైన బడ్జెట్ను రూపొందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ,ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కు రాష్ట్ర ప్రజల తరఫున పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు మీరు ఇచ్చిన అద్భుతమైన తీర్పు

### మాకు మరింత స్ఫూర్తిని, మరింత బాధ్యతను ఇచ్చింది

ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 14 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :ప్రజల సంక్షేమం కోసం, పారదర్శక పాలన కోసం, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న కాంగ్రెస్ పార్టీకి మీరు అందించిన ఈ ఘనవిజయం ప్రజాస్వామ్యంపై మీ నమ్మకానికి నిదర్శనం,ప్రతి ఓటు అభివృద్ధికి ఓ మద్దతు,ప్రతి విజయం ప్రజల ఆశలకు ఓ ప్రతిస్పందన,ఈ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం మాకర్తవ్యం, రాష్ట్ర ప్రజల విద్య, వైద్యం, ఆరోగ్యం, సంక్షేమం, శాస్త్ర సాంకేతిక రంగాల్లో మరింత పురోగతి సాధించేందుకు అహర్నిశలు కృషి చేస్తాముకాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించేందుకు,కృషి చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్త, మరియు మద్దతుదారులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. ??

సదా ప్రజాసేవలో

మీ

దామోదర్ రాజనర్సింహా

తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి



## మాజీ ఎమ్మెల్యే గుమ్మడి కి హానరరీ డాక్టరేట్

చెన్నై గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శనివారం చెన్నై, మైలాపూర్ భారతీయ విద్యా భవన్ లో జరిగిన కార్యక్రమంలో ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కు నామినేషన్ కమిటీ సభ్యుడు డాక్టర్ గౌని నర్సింహా గౌడ్, గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ యండి అరిఫుద్దీన్ లు హానరరీ డాక్టరేట్ అవార్డును అందజేశారు. గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ద్వారా డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్ (ఆనరిస్ కాసా) గౌరవ డాక్టరేట్ అవార్డును ప్రదానం చేసినందుకు డాక్టర్ (ఆనర్స్) గుమ్మడి నర్సయ్య అందజేయడం సంతోషకరమన్నారు. గుమ్మడి నర్సయ్య అద్భుతమైన ప్రయాణాన్ని అభినందిస్తున్నామని తెలిపారు. గుమ్మడి నర్సయ్య భవిష్యత్ ప్రయత్నాలన్నింటిలో విజయం సాధించాలని కోరారు. ఇల్లందు నియోజకవర్గానికి ఐదు సార్లు ఎమ్మెల్యే గా గెలిచి సాధారణ జీవితం గడపడం గుమ్మడి నర్సయ్య మంచితనానికి నిదర్శనమన్నారు. గుమ్మడి నర్సయ్య సమగ్రత, ఉద్దేశ్యంతో సమాజానికి సేవ చేయడానికి అతని పని ఇంకా చాలా మందికి ప్రేరణనిస్తుందని పేర్కొన్నారు. నర్సయ్య ప్రస్తుత సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

## ప్రజా బడ్జెట్ః ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతిః ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆశలను నెరవేర్చే బడ్జెట్ అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత బడ్జెట్ కేటాయింపులు చేశారని ఆయన చెప్పారు. శనివారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనునగుణంగా ఉందని ఆయన తెలిపారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్ గా మార్చేందుకు ముప్పయ్ వేల కోట్లు కేటాయించడం గొప్ప ముందడుగని ఆయన అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి రాయలసీమ అభివృద్ధిపట్ల ఉన్న అంకిత భావాన్ని తెలుపుతుందని ఆయన చెప్పారు. అలాగే రాష్ట్ర అభివృద్ధి 10.75 శాతంగా ఉంటుందని ఆర్థిక శాఖ అంచనా నిజం అవుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రంపై సుమారు పది లక్షల అప్పు పెట్టి వెళ్ళిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిన విధ్వంశాన్ని సరిదిద్దుతూ అభివృద్ధి, సంక్షేమం వైపు రాష్ట్రాన్ని పరుగులు పెట్టించేందుకు ఈ బడ్జెట్ దోహదపడుతుందని ఆయన చెప్పారు.


## జై ద్వారక క్యాంపెయిన్ వ్యవస్థాపకులు రవింద్రజిత్ కు రెండు ప్రపంచ రికార్డులు

భారత ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఆధునిక సాంకేతికతతో భవిష్యత్తు తరాలకు తెలిసేలా కృషి చేస్తున్న జై ద్వారక క్యాంపెయిన్ వ్యవస్థాపకులు రవింద్రజిత్ కు రెండు ప్రపంచ రికార్డులు దక్కాయి. శ్రీకృష్ణుడు పాలించిన ద్వారక నగర చరిత్రను ఏ.ఆర్ మొబైల్ మూవీ సిరీస్ ద్వారా ప్రజలకు చేరువ చేసిన రవింద్రజిత్ కు ఇండియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ మెడల్స్ అందజేశారు. హైదరాబాద్ నాంపల్లి నుమాయిష్ లో ఏర్పాటు చేసిన స్టాల్ లో వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు ఈ అవార్డ్స్ ను బహుకరించారు. జై ద్వారక క్యాంపెన్ ద్వారా పురాణ ప్రఖ్యాతి గాంచిన సముద్ర ద్వారక వారసత్వాన్ని ఆధునిక డిజిటల్ కథల రూపంలో ప్రపంచానికి పరిచయం చేస్తూన్నామని రవింద్రజిత్ తెలిపారు. ముక్యంగా యువతలో భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, ఆధ్యాత్మిక విలువలు ద్వారక నగర సముద్ర చరిత్రపై అవగాహన పెంపొందించడమే తమ లక్ష్యమని అన్నారు. పురాతన జ్ఞానాన్ని ఆధునిక తరాలకు చేరవేయడమే తమ ప్రధాన ధ్యేయమని చెప్పారు.

## కాచిగూడలో ఘనంగా అవంతి హెచ్ఆర్ కాన్క్లేవ్ 2026

అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజీ ఆధ్వర్యంలో కాచిగూడ మున్నూరు కాపు కళ్యాణ మండపంలో హెచ్ఆర్ కాన్క్లేవ్?2026 ఘనంగా నిర్వహించారు. పరిశ్రమలు?విద్యాసంస్థల మధ్య వారధిగా నిలిచిన ఈ వేదికలో ప్రముఖ కంపెనీల హెచ్ఆర్ ప్రతినిధులు, నిపుణులు, విద్యావేత్తలు పాల్గొన్నారు.ముఖ్య అతిథిగా తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ వి. బలకిస్ట రెడ్డి హాజరై విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.ఇటీవల ప్లేస్మెంట్ పొందిన విద్యార్థులు తమ అనుభవాలు పంచుకోగా, నిపుణులు కమ్యూనికేషన్, టెక్నికల్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంపై కీలక మార్గదర్శనం చేశారు.ప్రిన్సిపాల్ అప్పారావు వార్షిక నివేదిక సమర్పించగా, ప్లేస్మెంట్స్ విభాగం ప్రతినిధులు గణనీయ నియామకాలను వెల్లడించారు. సంస్థల అధిపతి శ్రీనివాస్ రావు హెచ్ఆర్ కాన్క్లేవ్ ప్రాముఖ్యతను వివరించారు.విద్యార్థులకు ఉపాధి దిశగా దారిచూపిన శక్తివంతమైన వేదికగా ఈ కాన్క్లేవ్ నిలిచింది.




Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com